సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక
RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv


అమరావతి సోమవారం 16 - ఆదివారం 22 జనవరి, 2017 సంపుటి : 2 సంచిక 17 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

వివరాలు 2లో...

కిట కిటలాడిన రైళ్లు

వివరాలు 3లో...

సంక్రాంతి సొబగులు

వివరాలు 5లో...

ఇంటింటా సంక్రాంతి సంబరాలు

వివరాలు 7లో...


చిరు ఈజ్ బాక్

వివరాలు 8లో...

సమానత్వమే మన అజెండా

## సైనికులకు నాసిరకం భోజనం

### కేంద్రానికి అవినీతి మరక



**న్యూఢిల్లీ :** నాసిరకం భోజనాన్ని అందిస్తున్నారని బీఎస్‌ఎఫ్ జావాను తేజ్‌బహదూర్ యాదవ్ వీడియోకు మద్దతుగా సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మరొకరు వీడియో పోస్టు చేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. ఎండనకా వాననగా, రేయింబవళ్లు, చలిని సైతం లెక్కచేయకుండా సరిహద్దు వద్ద కాపాలా కాసే సైకులకు నాసిరకం ఆహారం సరఫరాచేస్తున్నారనడం దేశవాసుల్లో ఆందోళన రేపుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద పారామిలటరీ దళం కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్)కి చెందిన కానిస్టేబుల్ జీత్‌సింగ్ తమపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని సామాజిక మాధ్యమంలో వీడియో పెట్టారు. సైనికులతో సమానంగా శ్రమిస్తున్నా వారితో సమానంగా వేతనాలు, సదుపాయాలు తమకు కల్పించడం లేదన్నారు. ఒకవైపు సరిహద్దు రక్షణదళాలు కన్నీరు పెడుతుంటే అబ్బేబ్బే ఏ సమస్యలేదంటూ ఉన్నతాధికారులు చెబుతుండటం ప్రజలకు ఆగ్రహం కలిగిస్తోంది. అవసరమైనప్పుడు సెలవులు దొరకవు. క్యాంటీన్ లేదు.. నిరంతరాయంగా పనిచేస్తుంటాం. రిటైర్మంటు తర్వాత పెన్షన్లు ఉండవు. ఎలా బతకాలి? ఏమిటీ దుర్గతి అంటూ జీత్‌సింగ్ పలు ప్రశ్నలు సంధించారు. 'లోక్‌సభ ఎన్నికల నుంచి స్థానిక ఎన్ని వరకు... ప్రార్థనమందిరాల నుంచి విమానాశ్రయాల వరకు మేంభద్రత కల్పిస్తాం. మా జీవితమంతా చత్తీస్‌గఢ్, జార్ఖండ్, కాశ్మీర్‌లోనే గడిచిపోతోంది. కనీసం ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్నంత విలువ కూడా మాకు లేదు. వారంతా నెలకు రూ.50-60 వేల జీతాలు తీసుకుంటూ సెలవుల్లో కుటుంబాలతో గడుపుతున్నారు. కానీ మా కోసం సంక్షేమ పథాకాలు కూడా లేవు. మా గోడు ఎందుకు పట్టించుకోరు' అంటూ జీత్‌సింగ్ భావోద్వేగంగా మాట్లాడారు. దీనిపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్పందిస్తూ ఇది చాలా పాత వీడియో అని దాటవేసేందుకు ప్రయత్నించారు.

**దిగొచ్చిన ప్రభుత్వం**

తేజ్‌బహదూర్, జీత్‌సింగ్‌ల వీడియోలు కలకలం రేపటంతో కేంద్రం దిగొచ్చింది. ఆయా వీడియోలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలిపింది. జవాన్ల పరిస్థితిని మెరుగు పర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి కిరణ్ రిజీజూ అన్నారు. జీత్‌సింగ్ వీడియోపై స్పందిస్తూ దీంతో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని, భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఈవారం రాజధాని

- నేడు కోసూరులో సంక్రాతి సంబరాలకు జబర్దస్త్ టీం : సంస్థ అధ్యక్షుడు పోతురాజు శ్రీనివాసరావు
- ఫిరంగిపురంలో 14,15న రాష్ట్రస్థాయి ఆటల పోటీలు :కార్యక్రమాల నిర్వహకులు ఫిరంగిపురం
- ఏప్రిల్ 5 నుంచి మాదిగల మహాసంకల్ప రధయాత్ర :రాష్ట్ర అధ్యక్షుడు రమణయ్య ప్రెసిడెంట్ ఎం.ఎన్ రాజు
- అమరావతి అభివృద్ధి శ్రీలంక భాగస్వామ్యం : ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2018 నాటికి యూజీడీ నిర్మాణం పూర్తి : గల్లా జయదేవ్
- ఫిబ్రవరి 10 నుంచి సెంట్రల్ జోన్ పోటీలు : ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య
- 19న సత్యతల్లి ఆలయంలో వేలంపాట : ఈవో సంధ్య
- ఫిబ్రవరి 8న పీఎస్ ఎల్‌వీసీ-37 ప్రయోగం : సతీష్ ధవన్

# కనిపించని సంక్రాంతి శోభ



ఒకప్పుడు సంక్రాంతంగే చలికాలంలో నులివెచ్చని ఆత్మీయానుబంధాలను అందించే పండగ, రైతులు, పల్లె ప్రజలంతా సంతోషాలతో తులతూగి, పట్టణ వాసులంతా పల్లెలకు తరలి వెళ్ళి అయినవాళ్ళతో అనుబంధాలను పెంచుకునే పండగ. చిన్నారుల నుంచి పల్లె పడుచుల వరకూ , కొత్త జంటల నుంచి ముత్తాత బామ్మల వరకూ అందరూ సంబరాల్లో మునిగితేలే పండగ.....ఇదంతా ఒకప్పటి వైభవం.....మరి ఇప్పుడో .....ఇవేమీ కనిపించడం లేదు. ఒక్క పదిపదిహేనేళ్ళు వెనక్కి తిరిగి చూడండి ఇప్పుడు మనం చెప్పుకున్నవన్నీ మన కళ్ళముందు కదలాడతాయో లేదో ! ఇప్పుడు ఈ పరిస్థితి ఉందా ! అంత సంతోషంగా పండగను జరుపుకోగలుగుతున్నామా ! అంతా యాంత్రికత. కనీసం భార్యాభర్తలు కూడా ఒక చోట ఉండని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. పంగడైనా, పర్వదినమైనా ఇదే పరిస్థితి. ఇంకా ఆత్మీయానుబంధాలకు చోటెక్కడిది. కొంతమంది మాత్రం పండగ కోసం. నగరాలు,పట్టణాల నుంచి పల్లెసీమలకు తరలి వెళుతున్నారు. కానీ, అక్కడా ఇప్పుడు పండగ వాతావరణం ఇంతకుమునుపులా కనిపించడం లేదు. ఆ వెళ్ళినవాళ్ళు కూడా పట్టుమని రెండురోజులు కూడా ఉండలేకపోతున్నారు. ఉద్యోగాలు, సెలవులు, బస్సు టికెట్లు, రద్దీ ఇవే ఆలోచనలు ఇంక పండగను ఆస్వాదించే సమయమేదీ!

అసలు పండగంటే....ఒకప్పుడు ఆంధ్రదేశమంతటా పల్లెల నుంచి ప్టణాల వరకూ ఎంతో ఉత్సాహంగా జరుపుకునేవారు. నెల రోజుల ముందే పండగ సందడి గ్రామాల్లో మొదలయ్యేది. ఇంటి ముందు రంగవల్లులు, వాటిమీద గొబ్బెమ్మలతో వాతావరణం కొత్త కళను సంతరించుకునేది, ఈ ముగ్గులు అందంగా కనిపించేందుకు ఆవు పేడతో కళ్ళాపు చల్లేవాళ్ళు. గొబ్బెమ్మల మీద పసుపు, కుంకుమ, గుమ్మడి పూలు అబ్బో. ఆ అందమే వేరు. తెలతెలవారుతూనే హరిదాసులు, కొంచెం పొద్దెక్కాక గంగిరెద్దుల వాళ్ళ సందడి ఉండేది. ఇప్పుడు ఇవేమీ లేవు. ఇవన్నీ కనుమరుగైపోయాయి. నేటి యువత, పిల్లలకు గంగిరెద్దులు, హరిదాసులు అంటే ఎవరో కూడా తెలియదు. శివుడిని కొలిచే జంగమ దేవరలు ప్రత్యేకంగా ఈ నెలలోనే ఇంటింటికీ తిరిగి వచ్చింది పుచ్చుకునేవారు. ధనుర్మాసంలో చలివేళ ఇంటి ముందు ఆవు పేడతో వేసే కళ్ళాపు, గొబ్బెమ్మల వల్ల సూక్ష్మజీవులు, దోమలు నశించేవి. ఇప్పుడు ఇవేమీ లేక రోగాలు ఎక్కువైపోయాయి. చుట్టు పక్కల అందరినీ పిలిచి వారితో కలిసి ఆడిపాడేవారు. చప్పట్లు కొడుతూ గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయమైన జానపద గేయాలు పాడేవారు. అదో సరదా, సంతోషంగా ఉండేది. ఆనందంగా అందరికీ తాంబూలాలూ ఇచ్చి పంపేవారు. సంక్రాంతి నెల రోజులూ అదో సందడిగా ఉండేది. ఇప్పుడు అసలు గొబ్బెమ్మలు పెట్టే వారే లేరు. నేటి ఆడపిల్లలకు అసలు గొబ్బెమ్మలు అంటేనే తెలియదు అన్నా ఆశ్చర్యం, అతిశయోక్తి లేదు. ప్రత్యేకంగా రైతు మహిళా కూలీలు, మత్స్యకార మహిళాలు ఈ నెలంతా ఇంటింటా తిరిగి గొబ్బెమ్మలతో ఆడిపాడేవారు. వారికి బియ్యం, డబ్బులు ఇచ్చి పంపేవారు దీని వలన వారి జీవనం గడిచేది. నేడు గొబ్బెమ్మలూ లేవు, గొబ్బిళ్ళ పాటలూ లేవు. ఆనాటి ఆనందాలు లేవు. గొబ్బెమ్మలు పూర్తిగా కనుమరుగైపోయాయి. తీరైన పంచెకట్టు, నుదిటిపై తిలకం, తలపై చిన్న పాత్ర, చేతిలో భజన చెక్కలు, భుజంపై వీణ...ఈ ఆహార్యం ఎవరిది? అంటే ఈ నాటి పిల్లలు చెప్పగలరా? హరిదాసులది అని! రామాయణం, భాగవత పురాణ గాధలు పాటలుగా పాడుతూ హరిలో రంగా హరి అంటూ వీధివీధీ తిరిగే హరిదాసులు, వారికి ధాన్యం లేదా బియ్యం ఇచ్చే ఇల్లాళ్ళు, పిల్లలతో వీధికే కొత్త అందం వచ్చేది. ఎవరైనా ధాన్యం వేస్తే మోకాళ్ళపై కూర్చుని ధాన్యం స్వీకరించి హరిలో రంగ హరి, క్రిష్టార్పణం అంటూ దీవించి వెళ్ళేవారు. గంగిరెద్దుల వాళ్ళు తమ ఎద్దులతో సన్నాయిలువాయిస్తూ ఇంటింటా భిక్షాటనకు వచ్చేవారు. బుడబుక్కలవాళ్ళు "అంబపలుకు జగదాంబ పలుకు" అంటూ ఢమరుకం వాయిస్తూ ఇంటిటికీ వచ్చేవాళ్ళు. సంక్రాంతి నెలలో వీరందరికీ అర సంవత్సరానికి సరిపడా

> సెలవలు పెట్టి నగరవాసులంతా సొంతూళ్లకు చేరుకున్నా, కొత్తబట్టలతో సందడి చేసినా, కోడిపందేలతో సరదాగా గడిపినా, సంక్రాంతి శోభమాత్రం కానరావడంలేదు. పండుగలలోని ఆత్మను పోగొట్టుకున్నాం. ఎందుకంటే సంక్రాంతి రైతుపండుగ, రైతు సంతోషంగా ఉంటేనే ఈ పండగకు అర్థం పరమార్థం... రైతు జీవితాల్లో ఉషస్సులు నింపిన నాడే అసలైన సంక్రాంతి.

- మిగతా 2 లో

# ఎయిర్‌షో.. ఆద్యతం అత్యద్భుతం



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** ఎప్పుడూ సముద్రతీరాల్లో వారికిక మాత్రమే కనువిందు చేసే ఎయిర్ షో ఈసారి విజయవాడలో నిర్వహించడం యువతను ఆనందానికి లోనుచేసింది. నగరవాసులు ఈ షోను చూడటానికి చాలా ముందుగానే ఘాట్‌కు చేరుకున్నారు. ఎయిర్‌షోతో కృష్ణానది తీరం పులకరించింది. నాలుగు విమానాలు రివ్వురివ్వున గగనంపైకి ఎగిరాయి. దట్టమైన పొగలు కక్కుతూ కొద్ది క్షణాలకే అవి వేరయ్యాయి. ఆకాశంలో సమాంతరంగానూ, వ్యతిరేకంగానూ కిందకూ, పైకీ చక్కర్లు కొట్టి, అందరినీ, ఆశ్చర్యచకితుల్ని చేశాయి. వాయుసేవకు చెందిన విమానాలతో గ్లోబల్ స్టార్స్ బృందానికి చెందిన పైలెట్లు చేసిన విన్యాసాలు ఆద్భుతంగా కొనసాగాయి. సరిగ్గా పైలెట్లు చేసిన విన్యాసాలు అద్భుతంగా కొనసాగాయి. సరిగ్గా 15 నిమిషాలు పాటు సాగిన ఎయిర్‌షో విజయవాడ నగర ప్రజల్ని కనువిందు చేసింది. పున్నమి, భవానీఘాట్లలో నుంచి ఎయిర్ షో లాంఛనంగా ప్రాంభమైంది. తొలిరోజు ఎయిర్ షో తిలకించేందుకు పున్నమి ఘాట్లకు కుంటుబ సమేతంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. గగనంలో చక్కుర్లు కొడుతూ, అద్భుతంగా విన్యాసాలు చేసిన విమానాల్ని ఆస్తకిగా తిలకించారు. ఈ విన్యాసాల సమయంలో నగరం విమానాల శబ్ధంతో హోరెత్తించిన ఒక్కొసారి ఆకాశం నుంచి కిందకు విమానం దిగినప్పుడు చూసిన వారంతా అది పడిపోతుందని ఆందోళన చెందగా, క్షణంలోనే రివ్వున పైకి ఎగిరిన దృశ్యాలు ఆస్తకికరంగా సాగాయి. ఎయిర్ షో కోసం భవానీపురంలోని పున్నమి ఘాట్ నుంచి భవానీస్నాన ఘాట్ వరకు 14 ఎకరాల్లో భారీ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నుంచి సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరి, స్థానిక ప్రజాప్రతినిధులు షోను తిలకించారు. 13వతేదీన ఉదయం 11గంటల నుంచి 11.15 గంటల వరకూ, మళ్లీ సాయంత్ర 4.30 గంటల నుంచి 4.45 వరకూ విన్యాసాలు కొనసాగుతాయి. 14వ తేదీ ఉదయం 11నుంచి 11.15 వరకు, సాయంత్రం 4.15 4.30 వరకు ఎయిర్ షో నిర్వహిస్తారు. యునైటెడ్ కింగ్‌డమ్ దేశానికి చెందిన మార్క్ జఫ్రీ నాయకత్వంలోని గ్లోబల్ స్టార్స్ టీమ్ పైలెల్స్ ఈ అద్భుత విన్యాసాలకు సారధ్యం వహించారు. తొలిరోజు నగర పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి ఎయిర్‌షోను తిలకించడంతో పున్నమి, భవానీ ఘాట్‌లు కిటకిటలాడాయి.

## భోగి మంటలు అంటుకున్న వ్యక్తిని కాపాడిన ఎమ్మెల్యే



**గుంటూరు:** భోగి వేడుకల్లో అపశ ృతి చోటు చేసుకుంది. గుంటూరులో జరుగుతున్న భోగి వేడుకల్లో ఓ వ్యక్తికి మంటలు అంటుకున్నాయి. భోగి మంటలు అంటుకుని ఒక వ్యక్తికి గాయాల పాలయ్యాడు. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న భోగి వేడుకల్లో ప్రజలు, నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈక్రమంలో భోగి మంట వెలిగించారు.అయితే మంట ఒక్కసారిగా ఎగిసిపడడంతో అక్కడ ఉన్న ఒక వ్యక్తికి అంటుకున్నాయి. అయితే పక్కనే ఉన్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి అప్రమత్తంగా వ్యవహరించి, సదరు వ్యక్తిని పక్కకు లాగారు. అనంతరం గాయపడిన వ్యక్తిని దగ్గరుండి ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే చేసిన పనితో ఒక వ్యక్తికి ప్రాణాపాయం తప్పిందని పలువురు ప్రశంసించారు.







## భూగర్భ డ్రైనేజి నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూపులు...

### పట్టణానికి రూ.6 కోట్లు నిధులు హామీ ఇచ్చిన జడ్.పి. ఛైర్మన్ బాపిరాజు

**అన్నంరెడ్డి.సుబ్బారావు,రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం. :** భూగర్భ డ్రైనేజి వ్యవస్థను నిర్మించి రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర దిశగా తీర్చిదిద్దాలని పాలకులు, ప్రభుత్వం తరచూ ప్రకటిస్తున్నారు. స్థానికంగా ఉండే రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల స్థితిగతులు ఇందుకు అడ్డు గోడలుగా నిలుస్తుండటంతో ఆశించిన మేరకు అభివృద్ధి పనులు కార్యరూపం దాల్చటంలేదు. మండల కేంద్రమైన కొయ్యలగూడెంలోను ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉంది. దాదాపు 18 వేల జనాభా గల కొయ్యలగూడెం పట్టణంలో భూగర్భ డ్రైనేజి నిర్మించటానికి రూ.6 కోట్లు నిధులను జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు,మంజూరు చేయటానికి సముఖ వ్యక్తం చేసారని జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్‌గా ఉన్న స్థానిక జడ్.పి.టి.సి. సభ్యురాలు చింతల వెంకటలక్ష్మీ తెలిపారు. జడ్.పి. ఛైర్మన్ ఆదేశాల మేరకు గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు దాదాపు యేడాదిన్నర క్రితమే అంచనా ప్రతిపాదనలు రూపొందించి జిల్లా పరిషత్‌కు సమర్పించారు. మండలంలోని కొయ్యలగూడెంలో 2500 మీటర్లు పొడవున భూగర్భ డ్రైనేజి నిర్మించటానికి ఆరు కోట్ల రూపాయలు వ్యయం కాదని అంచనాలు ప్రతిపాదనలలో పేర్కొన్నారు. కొయ్యలగూడెంకు మంజూరు ఇచ్చే రూ.6 కోట్ల నిధులలో కనీసం 10 నుంచి 20శాతం నిధులను గ్రామ పంచాయతీ జడ్.పి.కి జమచేయవలసి ఉంటుందని జడ్.పి. ఛైర్మన్ బాపిరాజు పరింపూడి పంచాయతీ

- మిగతా 6 లో


రాజధాని వార్తలు
కలం

## ప్రజల్ని పండుగలు చేసుకోనీయండి

పిచ్చికుదిరింది రోకలు చుట్టండి అన్నట్లుగా ఉంది ప్రభుత్వం వ్యవహారం. చంద్రబాబు హయాంలోని తెలుగుదేశం మొదటిసారి పాలనలో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించి కలెక్టర్లకు చీపురులిచ్చి ఊడ్పించేవారు. ప్రతిపక్షాలు , మేధావులు ఈ చర్యలతో తలలు పట్టుకునేవారు. వారి అసలు పనులు చేసుకోనీకుండా రోజుకు రూ.200లతో వర్కర్లు చేసేపనిని ఐఏఎస్‌లకు అప్పగించడమేమని గగ్గోలు పెట్టినా ముఖ్యమంత్రి ససేమిరా కొంచెం కూడా మారలేదు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి తలెత్తింది. సచివాలయంలో మహిళా ఉద్యోగులు ముగ్గుల పోటీల్లో పాల్గొవడం, అత్యున్నత మహిళా అధికారి వాటికి బహుమతులు అందచేయడం ఎంత కాలాతీత, దండగ పనులో చెప్పనక్కర్లేదు. కుటుంబపరంగా, బంధుమిత్రులతో చేసుకోవాల్సిన పండగలను తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు జరపడం ప్రజలకు శాపంగా మారింది. రాష్ట్ర అధికారులు ప్రజాకార్యాలు పక్కనబెట్టి చిల్లర పనులు చేయడం ఎంతమాత్రమూ హర్షణీయం కాదు. సచివాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మార్చాలనే ధృడ సంకల్పంతో ముఖ్యమంత్రి ఐదురోజుల పనిదినాలను ప్రవేశపెట్టారు. దీంతో ఆయా ఉద్యోగులంతా ఉదయం 9 గంటలకు ఆఫీసుల్లో ఉండాలి. రాజధాని పరిసర ప్రాంతాలైన మంగళగిరి, గుంటూరు, విజయవాడల నుంచి సచివాలయానికి ఉద్యోగులు 10.30 గంటలకు చేరుకుంటున్నారు. మధ్యలో టీలు, లంచ్, బ్రేక్‌లతోనే సరిపోతుంది. ఇది చాలదన్నట్లు శుక్రవారం వారు కార్యాలయానికి బట్టలబ్యాగుతో వస్తారు. అంతే ఆరోజంతా ఎప్పుడు నాలుగవుతుందా వెళ్లిపోదాం అన్నట్లు వుంటుంది వాళ్ల వ్యవహారం. సోమవారం ఉద్యోగులు సచివాలయం చేరుకునేటప్పటికి 11.30 దాటుతోంది. ఇది అందరికీ తెలిసిన విషయమే.. దీనిలో వాళ్లు మనస్ఫూర్తిగా పనిచేసేది చాలా తక్కువగా ఉంటోందని సచివాలయానికి అనేక పనుల నిమిత్తం వచ్చిన సాధారణ పౌరులు మొత్తుకుంటున్నారు. ఇదే సమయంలో క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి వేడుకలంటూ అత్యున్నత అధికారులతో ప్రభుత్వం ముగ్గులు పెట్టించడాన్ని వాళ్లు జీర్ణించుకోలేక పోతున్నారు. నిజానికి ఇది రైతుల పండుగ. ధాన్యం చేతికొచ్చి, వాటి అమ్మకాలతో చేతిలో పైసలు పడి, చుట్టాలను పక్కాలను పిలుచుకొని కూతురు, అల్లుడికి అతిథి మర్యాదలు చేసి, సంతోషించే రోజు. కోడిపుంజులుంటే పందేలు వేసి వినోదించే రోజులు. నిజానికి దేశం మొత్తం నగరీకరణ జరుగుతున్న నేపథ్యంలో ఈ పండుగ తన ప్రాభవాన్ని కోల్పోయింది. అయితే ఈ పండుగను ప్రభుత్వం, అధికారులు నిర్వహించడమే మరింత హాస్యాస్పదం. ప్రజలకు అవకాశాలు, సదుపాయాలు కల్పిస్తే సరిపోతుంది. ప్రతిదానిలో ప్రభుత్వం తలదూర్చనక్కర్లేదు.

సంక్రాంతి కోసం జిల్లాకు ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేసింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక్కోజిల్లాలో 10 చోట్ల ముగ్గులు పోటీలు పెట్టి, బహుమతులు అందచేసినా ఇచ్చే వెయ్యినూటపదహార్లకి షామియానా ఖర్చుకి ఎంతవుతుంది. ఎంత సొమ్ము రాజకీయనాయకు జేబుల్లోకి పోతుందో ఒక్కసారి ఆలోచించండి. దానిబదులు గ్రామీణప్రాంతాల్లోని వైద్యశాలల్లో వసతులు కల్పిస్తే గ్రామీణులు సంతోషించేవారు. ఏ ఉపద్రవం ఎదురైనా వారు పట్టణాలకు పోలేక ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక విప్లవం వచ్చినా ఇంతవరకు గ్రామీణులకు అవసరమైన విద్యా, వైద్యంలో వసతులు కల్పించకపోవడం విషాదకరం.

ప్రభుత్వం ప్రజలకు తాత్కాలిక ఉపశమనం పొందించే పనులు కాకుండా శాశ్వతంగా ఉపయోగపడే పనులు చేపట్టాలి. చంద్రన్న సంక్రాంతి కానుకంటూ ఉచితంగా తెల్లరేషను కార్డువారికి బహుమతిని అందించారు. దానిలో బెల్లం, వందగ్రాముల నెయ్యి, కిలో కందిపప్పు, కేజీనూనె వంటివి సరఫరా చేశారు. దీని ప్రచారం పటాటోపంగా చేశారు. దీంతో పేదసాదలు, ముసలీముతకా డీలర్లవద్ద బారులుతీరారు. తీరా చూస్తే సర్వర్ ఎంతకీ పనిచేయలేదు. దీంతో వారంతా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరికొందరు దినసరి కూలీలను వదిలి రోజులపాటు క్యూల్లో నిలబడవలసి వచ్చింది. ఇదంతా ఒక ప్రహసనంగా మారి వారంతా అసహనానికి గురయ్యారు. నిజానికి ప్రజలను బిచ్చగాళ్లలా కాకుండా వారి కాళ్లపై నిలబడేట్లు చేస్తే బాగుండేది. కుంటుంబానికి తండ్రి బాధ్యత ఎంతో రాష్ట్రానికి ముఖ్యమంత్రి బాధ్యత కూడా అటువంటిదే... పిల్లలు తమ కాళ్లపై నిలబడాలని తండ్రి ఎంతగా పరిశ్రమిస్తారో ముఖ్యమంత్రులు కూడా అటువంటి బాధ్యతే చేపట్టాలి. తాత్కాలికాలకు అలవాటు పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.ప్రతివారికి జీవించేహక్కు, విద్యా,వైద్య, ఉపాధి హక్కులు కల్పించడం ద్వారా ఉచితాలను తగ్గించవచ్చు. మంత్రుల, అధికారుల మితిమీరిన ఖర్చులు, ప్రజలకు ఉచితాలు నివారించాలి. రాష్ట్రప్రజల నుంచి మంత్రుల వరకు ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకోవాలి.




# కిటకిటలాడిన రైళ్లు

- ప్రైవేటు ట్రావెల్స్ దోపిడి
- బెంబేలుత్తుతున్న ప్రయాణికులు



**రాజధాని ప్రతినిధి - గుంటూరు :** సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో ఉన్న బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. అలాగే ఉద్యోగులు కూడా కొంత వరకు సెలవులు పెట్టి సొంత ఊరులకు ప్రయాణమవుతున్నారు. దీనివలన గుంటూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే జనంతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు రద్దీగా దర్శనమిస్తున్నాయి. రైల్వేస్టేషన్‌లో ఏ రైలు ఎక్కుదామన్నా రిజర్వేషన్లు ఫుల్‌బోర్డులు దర్శనమిస్తున్నాయి. కామన్‌బోగీలో ఎక్కుదామంటే కాలుపెట్టేందుకు వీలులేకుండా నిండిపోయాయి. ఇదే అదనుగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం భారీగా ఛార్జీలు వసూళ్లు చేస్తూ ప్రయాణికులకు దోసుకుంటున్నారు. రాజధాని పరిధిలో ఉన్న గుంటూరులో హైదరాబాద్, బెంగళూర్ , విశాఖపట్నం, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, కడప, కర్నూల్, అనంతపురం వంటి ప్రధాన ప్రాంతాల నుంచి వచ్చి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. ఈనెల 13వతేదీ భోగిపండుగ, ఈనెల 14వతేదీన మకర సంక్రాంతి, ఈనెల 15తేదీన కనుమ పండుగలు వచ్చాయి. హిందువులు ఎంత దూరంలో ఉన్నప్పటికీ ఏటా ఈ పండుగలు ఘనంగా నిర్వహించుకునేందుకు సొంత ఊరులకు బయలుదేరి వస్తారు. కుటుంబసమేతంగా ఎంతో సంతోషంగా పండుగలను నిర్వహించుకుంటారు. కొందరు అత్తమామల ఇళ్లకు వెళ్లి వారితో ఆనందంగా నండుగలు నిర్వహించుకుంటారు. ఈ నేపథ్యంలో గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి సొంత ఊరులకు వెళ్లేందుకు వచ్చే ప్రయాణికులతో గుంటూరు బస్టాండ్‌తోపాటు, రైల్వే స్టేషన్ కూడా కిటకిటలాడుతుంది. రైల్వేస్టేషన్‌లో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కౌంటర్లు రద్దీగా కనిపించాయి. రైల్వే విభాగం సంక్రాంతి నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నప్పటికీ అవి సరిపోవడంలేదు. అలాగే గుంటూరు బస్టాండ్‌తోపాటు ఇతర బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. గుంటూరు నుంచి తెలంగాణతోపాటు విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్, బెంగళూరు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మరింది. దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల టిక్కెట్లు దొరకడంలేదు. ఏపీఎస్ఆర్‌టీసి సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం తదితర నగరాలకు 270 ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రకటించింది. అయినప్పటికీ రద్దీ ఉండటంతో తప్పనిపరిస్థితిలో ప్రయాణికులు ప్రైవేటు సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు బస్సు సర్వీసుల యాజమాన్యం రెచ్చుపోతున్నారు. ఇష్టారాజ్యంగా ఛార్జీలు వసూళ్లు చేస్తున్నారు.

### నడ్డి విరుస్తున్న ప్రైవేటు ట్రావెల్స్

సంక్రాంతి నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ ప్రయాణికుల నడ్డి విరుస్తున్నారు. సాధారణ రోజుల్లో గుంటూరు నుంచి బెంగళూర్‌కు నాన్‌ఏపీ బస్సు టిక్కెట్ రూ.700 ఉండగా ఇప్పుడు రూ.2,200 వరకు వసూళ్లు చేస్తున్నారు. అలాగే బెంగళూర్‌కు ఏసీ బస్సు సర్వీసులు సాధారణ రోజుల్లో రూ.1,200 ఉండగా ఇప్పుడు రూ.3వేలు వరకు వసూళ్లుచేస్తూ ప్రయాణికులను అందినంకాడికి దోసుకుంటున్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు సాధరణ రోజుల్లో నాన్ ఏసీ రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.700 వరకు వసూళ్లు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో గుంటూరు నుంచి చెన్నైకు నాన్‌ఏపీ రూ.350 ఉండగా ఇప్పుడు రూ.800 వరకు ఛార్జీలు వసూళ్లు చేస్తూ ప్రయాణికుల నడ్డి విరుస్తున్నారు. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. రైల్వే టిక్కెట్లు ఏపీఎస్ఆర్‌టీసీ బస్సుల టిక్కెట్లు దొరక్కపోవడం వలన తప్పనిపరిస్థితిలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఎక్కుతున్నామని దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు.

### ప్రైవేటు ట్రావెల్స్‌పై పర్యవేక్షణ

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం అదనంగా టిక్కెట్ ఛార్జీలు వసూళ్లు చేస్తున్నందున వారిపై పర్యవేక్షణ ఉంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. టిక్కెట్ ధర కంటే రెండు మూడు రెట్లు వేసుకుని ఛార్జీలు వసూళ్లు చేయడం అన్యాయమని ప్రయాణికులువాపోతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టిని కేంద్రీకరించి అదనపు ఛార్జీల వసూళ్లకు అడ్డుకట్టవేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆన్‌లైన్‌లో పిడకలొచ్చాయ్..

**రాజధాని ప్రతినిధి–విజయవాడ :** సాంకేతికత పెరగడంతో తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి వేడుకల్లో తొలిరోజు భోగినాడు మంటల్లో వేసేందుకు ఆవు పిడకలను సైతం ఆన్‌లైన్‌లో పెట్టి ఎడాపెడా విక్రయిస్తున్నాయి. పట్టణాల నుంచే కాదు... చివరకు గ్రామీణ ప్రాంతాల నుంచీ ఆయా ఆన్‌లైన్ కంపెనీలకున్న డిమాండుకు అద్దం పడుతోంది. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలంగా నిలిచే పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఆరుగాలం శ్రమించిన రైతాంగం చేతికొచ్చిన పంటను అమ్మి వచ్చిన సొమ్ముతో కుటుంబసభ్యులు, బంధుమిత్రలతో కలసి ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకుంటారు. ఒకప్పుడు పండుగొస్తుందంటే చాలు... వారం, పది రోజుల ముందునుండే ఇళ్లకు సున్నాల వేయడం, ద్వారబంధాలు, కిటికీలు, ఎడ్లబండ్లకు రంగులు వేయించడం, పాత సామగ్రి స్థానంలో కొత్తవి అమర్చుకోవడం, పిండి వంటకాలు తయారు చేసి ఇంటిల్లపాదీ కొత్తబట్టలు కొనుగోలుచేసి దర్జీవద్ద కొలతలిచ్చి కుట్టించుకుని మరీ సంప్రదాయంగా వేడుకలు జరిపేవారు. ఇవన్నీ కష్టం, శ్రమతో కూడుకున్నవి కావడం, రెడీమేడ్ దుస్తులు, సంప్రదాయ పిండివంటలు కూడా. సొంతిల్లు, స్వగృహ, మన గృహ.. పేర్లతో అరిసెలు, బురెలు, గారెలు, చక్రాలు అమ్మేస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఆవుపేడను సేకరించి గొబ్బెమ్మలు పెట్టడం, వాటిని పిడకలుగా చేసి దండలుగా గుచ్చి భోగి మంటల్లో వేయడం ఆనవాయితీ. సంస్కృతీ సంప్రదాయాలను తిరిగి కొనసాగించాలని కొందరు ఆసక్తి చూపుతున్నప్పటికీ సమయాభావంతో చేయలేకపోతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొన్ని ఆన్‌లైన్ షాపుల నిర్వాహకులు వాటిని సమకూరుస్తున్నారు. ఇందులో భాగంగా కొద్దిరోజులుగా అమెజాన్, షాప్‌క్లూస్, ఇబే.. వంటి సంస్థలు ఆన్‌లైన్‌లో ఆవు పిడకలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. వీటి పరిమాణంతోపాటు బరువు, మందం



తదితర వివరాలను కూడా ఆన్‌లైన్‌లో స్పష్టంగా పేర్కొన్నాయి. ముందుగానే ఆయా మొత్తాలను ఆన్‌లైన్‌లో చెల్లించడం, తాను ఆన్‌లైన్‌లో బుక్ చేసిన 48 గంటల్లోనే ఇంటికి పిడకలు వచ్చాయని విజయవాడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి వనజాక్షి తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్లను గమనిస్తే.. నగరాలు, పట్టణాల నుంచే కాకుండా పల్లెల కూడా పెద్దఎత్తున వస్తున్నాయి. గ్రామాల్లో ఆవుల సంఖ్య తగ్గిపోవడంతో బోగి పిడకల తయారీ క్రమేణా తగ్గిపోయి నట్లు చెబుతున్నారు. అదీకాక గ్రామీణ ప్రాంతాల్లోని యువతులు విద్యావంతులు కావడంతో పేడను సేకరించడం, వాటిని పిడకలుగా చేసి ఆరబెట్టడం శ్రమతో కూడుకోవడం ఒక కారణంగా తెలుస్తోంది. ఆన్‌లైన్ షాపింగ్‌లో ఈ ఏడాది పిడకలు ప్రత్యక్షం కావడంతో పెద్దల ప్రోత్సాహంతో పల్లెల్లోని యువతులూ ఆన్‌లైన్‌లో వీటిని బుక్ చేస్తున్నారు. ఆవు పిడకలు ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న విషయాన్ని తెలుసుకున్న పెద్దలు ఒకింత ఆశ్చర్యానికి లోనవుతున్నారు. ఆఖరుకు పిడకలను కూడా అమ్ముకునే రోజులు వచ్చాయి.. భవిష్యత్తులో ఇంకా ఇలాంటి ఎన్ని వింతలు చూస్తామో అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.


మరో 20 రోజుల్లో పూర్తికానున్న సచివాలయ భవనం

## కనిపించని సంక్రాంతి శోభ

(మొదటిపేజీ తరువాయి)

భుక్తి లభించేది. కొద్దికాలం వరకూ వారి జీవినానికి ఎలాంటి ఢోకా లేకుండా ఉండేది. ఇవన్నీ నేడు కనుమరుగై పోయాయి. సంక్రాంతి అంటే గుర్తొచ్చే మరో విషయం.... నోరూరించే అరిశెలు. ఈ అరిశెల కోసం....పండగకి పదిపదిహేను రోజుల ముందే ప్రతి ఇంటా వేకువజామునే రోకళ్ళ దంపుళ్ళు మొదలయ్యేవి. ఆరోజుల్లో అరిశెలకు దంపుడు బియ్యంపిండినే ఉపయోగించేవారు. నేడు అరిశెలు చేసేవారు బాగా తగ్గిపోయారు. చేసినా మరపిండితోనే చేస్తున్నారు చాలామంది రెడీమేడ్‌గా బయట దుకాణాల్లో దొరికే అరిశెలనే తెచ్చుకుంటున్నారు. ఆ రోజుల్లో మానెడు బియ్యం అంటే రెండు కేజీలు దంచితే ఐదారు రూపాయలు ఇచ్చేవారు. ఇప్పుడు వంద రూపాయలు ఇచ్చినా దంచేవాళ్ళే లేరు. సంక్రాతికి అరిశెలతో పాటు తయారుచేసే సున్నుండలు, జంతికలు, ఇతర తినుబండారాలన్నీ శివరాత్రి వరకూ నిల్వ ఉండేవి. రైతులు తమకు వ్యవసాయ పనుల్లో తోడ్పడ్డ కూలీలకు, వడ్రంగులకు, కుమ్మరులకు, గ్రామ నౌకర్లకు ధాన్యంతో పాటు అరెశెలు, చక్రాలు ఇతర తినుబండారాలు అన్నీ పంచేవారు. అనాటి రైతు పరిస్థితి ఇది. ధాన్యపురాశులు, పంట సిరులతో రైతు కళకళలాడేవాడు. రైతు ఇల్లు సంతోషాల పొదరిల్లులా ఉండేది. నేటి రైతు....గుప్పెడు మెతుకులు తినడానికి నోచుకోలేకపోతున్నాడు. అందరికీ పెట్టడం సంగతి అలా ఉంచితే.... తన కుటుంబ సభ్యులకు కూడా నిండా పొట్టనింపే పరిస్థితి ఉండడం లేదు.

### కనుమ నాడు ముక్క

మూడో రోజు కనుమనాడు అన్నదాత ఇంట పశువుల కొమ్ములకు రంగులు దిద్ది పూలదండలతో అలంకరించి పరవశించేవారు. ఇంట్లో మాంసం వండేవారు. ఇది కూడా అందరూ కలిసి ఆనందంగా భోజనం చేసేవారు. ఇప్పుడు అరోజు, ఈరోజు అని లేకుండా ప్రతి రోజూ విచ్చలవిడిగా మాంసం, మద్యం జోరుగా లాగించేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎద్దుల పోటీలు, బండ లాగుడు పోటీల పేరుతో మూగ జీవులను నిషేధించినట్లే కనుమనాడు జరుగుతున్న ఈ బండ లాగుడు పోటీలను కూడా నిషేధించి మూగ జీవులకు వేదన తప్పించాలి. వాటిపై హింసను అడ్డుకోవాలి. ఇప్పుడు పడగ ఏదైనా సందడి కోసం సందడి చేస్తున్నారు. అందులో సహత్వం కనిపించడం లేదు. ఆనాటి అసలైన కోలాహలమూ లేదు. పండగ అంటే పదిమందీ కలిసి మెలిసి ఆనందాన్ని పంచుకునే రోజులు మళ్ళీ తిరిగి రావాలి!

## వ్యవసాయరంగం అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం

ఎమ్మెల్యే.మొడియం శ్రీనివాసరావు

**అన్నంరెడ్డి.సుబ్బారావు,రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం. :** రైతుల శ్రేయస్సు,వ్యవసాయరంగం అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే మొడియంశ్రీనివాసరావు పేర్కొన్నారు.1996–2004 మధ్య చంద్రబాబుపాలనతో గ్రామీణ ప్రాంతాలలో పనికి ఆహార పథకం, జన్మభూమి పథకాల నిధులలో పొలాల నుంచి గ్రామాలకు పుంత రోడ్ల నిర్మాణం జరిగిందని, ఇప్పుడు నిర్మాణం, అభివృద్ధి పనులను, వ్యవసాయ మార్కెట్ కమిటీల నిధులు, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టారని ఆయన అన్నారు. బయ్యన్‌గూడెం– సరిపల్లి ఆర్ అండ్ బి.రోడ్డు నుంచి పొలాలకు వెళ్ళే పుంత మార్గంలో రూ.15.50లక్షలు ఎ.ఎం.సి., ఉపాధి హామీ నిధులతో నిర్మించిన 2.25 కి.మీ. గ్రావెల్ రోడ్డును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆసందర్భంగా అక్కడకు వచ్చిన బయ్యనగూడెం, సరిపల్లి గ్రామాల రైతులు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. ప్రారంభించిన రహదారి మార్గంలో వాగు పైన, సరిపల్లి గ్రామాల రైతులు పొలాల్లోకి వెళ్లే మార్గంలో ఉన్న వాగుపైన కల్వర్టులు నిర్మించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు.

# ధాన్యం నిల్వకు పాటించవలసిన జాగ్రత్తలు

వరి నూర్పిళ్ళు ముమ్మరమయ్యాయి.పండించిన పంట రైతులకు అందుబాటులోకి వచ్చేస్తుంది. అమ్మబోతే అడవి –కొనబోతే కొరివి అన్నట్లుగా ఉంది రైతు పరిస్థితి. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్ముకొనే మార్గాలు కనిపించటంలేదు. గిట్టుబాటు ధర లేకపోవటం, పెద్ద నోట్ల రద్దు వల్ల ఆర్థిక మాంధ్యం ఏర్పడటం, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు పూర్తి సామర్ధ్యంతో పనిచేయలేకపోవటం వల్ల రైతులకు దిక్కు తోచటం లేదు. ఇలాంటి దశలో ధాన్యం నిల్వ చేసుకోసుకోవడం మినహా రైతుకు మరో దారి లేదు. ధాన్యం నిల్వ విషయంలో ప్రతిరైతు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే నష్టపోతారు.పంట కోత పూర్తయిన తర్వాత ధాన్యంలో 20 నుంచి 30శాతం నష్టం ఉంటుందని అంచనా. ఆ నష్టాన్ని నివారించే పద్ధతులు రైతులు ఆచరించారు. నిల్వ ధాన్యాన్ని పురుగులు, బూజు తెగుళ్ళు, ఎలుకలు ఆశించి నష్టం కలిగిస్తుంటాయి. వాటిని నివారించే ప్రయత్నం చేయాలి. ధాన్యాన్ని నష్టం కలిగించే చీడపురుగులు రెండు రకాలు గింజలోపల నుండి అభివృద్ధి చెందే పురుగులు ఒక రకం. వీటిలో బియ్యం ముక్కు పరుగు, వడ్ల చిలుక, పెంకుపురుగు, వేరుశెనగ ఆశించే బళ్ళ పురుగు ముఖ్యమైనవి. ఇది లార్వా దశలోనే గింజల లోపలికి చొచ్చుకుపోయి, పోషకాలను తింటూ, అక్కడే జీవిత దశలన్నీ పూర్తి చేసుకొని, రంధ్రాలు చేసుకొని బయటకు వస్తాయి. వీటి ఉధృతి పెరిగినపుడు బస్తాల నుండి పొడి బయటకు రావటం గమనించవచ్చు. రెండవ రకం గింజల బయట నుండి నష్టం కలిగిస్తాయి. వీటిలో ఎర్రపెంకు పురుగు, రంపపు పళ్ళ పెంకు పురుగు, బియ్యం చిలుక, కాప్రా పెంకు పురుగులు ముఖ్యమైనవి. ఇవి ఆశించిన ధాన్యం ముక్కిపోయి, వాసన వస్తుంది. ఇవి ధాన్యాన్ని తుట్టెలుగా మార్చటం వల్ల బియ్యం నాణ్యత, దిగుబడి తగ్గుతుంది.

### పురుగులు వల్ల నష్టాలు

ఇవి ఆశించినపుడు ధాన్యం రంగు మారుతుంది. నాణ్యత, బరువు తగ్గుతుంది. స్వత: సిద్ధమైన రుచి, వాసన తగ్గి తినటానికి పనికి రాకుండా పోతాయి. విత్తనంగా ఉపయోగించితే మొలక శాతం గణనీయంగా తగ్గుతోంది. పోషక విలువలు కూడా తగ్గిపోతాయి. ఇలా నష్టం కలిగించే పురుగులు సాధారణంగా పొలం నుంచి, కళ్లాల నుంచి గోదాములకు లేదా నిల్వ ప్రదేశాలకు చేరతాయి. ధాన్యం నూర్పిడి యంత్రాలను, పరికరాలను, రవాణా ట్రాక్టర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. నూర్పిడి అనంతరం ధాన్యంలో తేమశాతం 12కి వచ్చే వరకు ఆరబెట్టాలి. ధాన్యం నిల్వచేసే గదులకు, గోదాములకు సున్నంవేయించాలి. గోడలను పగుళ్ళు, ఎలుకల రంధ్రాలు లేకుండా ముందే జాగ్రత్త పడాలి. ధాన్యం నిల్వ చేసే ప్రదేశంలో పాత ధాన్యం లేకుండా చేయుట గోడలపై లీటరు నీటిలో మలాథియన్ 10మి.లీ లేదా డెల్టా మాత్రిక 1.5 మిల్లీ లీటర్లు మందు కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి. పాత సంచుల్లో ధాన్యం నింపేటపుడు లీటరునీటికి డెల్టా మాత్రిక మందు 1.5 మి.లీ కలిపిన మందు ద్రావణంతో సంచులను తడిపి, ఆరబెట్టిన అనంతరమే, ధాన్యం సంచుల్లో నింపాలి. ధాన్యం బస్తాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నేలపైగాని, గచ్చు పై గాని పేర్చకూడదు. ఎత్తయిన చెక్కలపైనే బస్తాల వరుసలు పేర్చాలి. ఒక వరుస అడ్డంగా, రెండో వరుస నిలువుగా పేర్చడం శ్రేయస్కరం బస్తాల వరుసలుగా పేర్చేటపుడు విధిగా అల్యూమినియా ఫాస్ఫైడ్ బిళ్ళలను వరుసల మధ్య ఉంచాలి. మెట్రిక్ టన్ను ధాన్యం నిల్వకు మూడు బిళ్ళలు ఉంచితే సరిపోతుంది. గోదాములు, గదులు అందుబాటులో లేనపుడు బహిరంగ ప్రదేశాల్లోనే ధాన్యం నిల్వవుంచటం అనివార్యమౌతుంది. అలాంటపుడు కూడా బస్తాల వరుసల మధ్య అల్యూమినియం ఫాస్ఫైడు బిళ్ళలు వుంచటం అనివార్యం. బస్తాల వరుసల మధ్యకు గాలి చొరబడకుండా, టార్ఫాలిన్‌తో కప్పి, ఎగిరిపోకుండా చుట్టూ తాళ్ళతో కట్టాలి. కొద్ది రోజులు ఊదరపెడితే పరుగులు.ఎలుకలు కూడా చనిపోతాయి.

పర్యావరణానికి, మానవళికి హాని కలిగించని వేపనూనె, వేప గింజల పొడి, వస కొమ్ముల పొడి ఉసిరి లేదా సీతఫలం గింజల పొడి ధాన్యంలో కలిపి నిల్వ చేస్తే 6 నుంచి 9 మాసాలు పాటు ధాన్యం చెడిపోకుండా ఉంటుంది. విత్తనంగా ఉపయోగించే ధాన్యంకు ఈ విధానం అనుసరణీయం, లేదంటే 100 కిలోల విత్తనానికి 500 మి.లీ. వేపనూనెగాని, 250 గ్రాముల థైరామ్‌పోజగాని, 4 గ్రాముల స్పైనో శ్రాడ్ పొడిగాని, 40 గ్రాముల ఇరూమెక్టిద్ బెండోయేట్‌గాని కలిపి, నీడలో ఆరబెట్టి,బస్తాలల్లో నింపి ఎత్తున ధాన్యం భద్రపరుచుకోవాలి.

– దాసరి ఆళ్వాస్వామి
93938 18199




## పండక్కి పెరిగిన బంగారం ధర



**న్యూఢిల్లీ :** దేశీయ మార్కెట్‌లో బంగారం ధర రూ.29,000 మార్కును దాటింది. 10గ్రాముల బంగారం రూ.330లు పెరిగి రూ.29,030లకు చేరింది. అంతర్జాతీయ బులియెన్ మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ పెరగడం, స్థానిక వర్తకదారుల నుండి బంగారు ఆభరణాలకు డిమాండ్ పెరగడం నెలరోజుల గరిష్టానికి చేరింది. వెండి కూడా రూ.350కు పెరిగి కేజీ వెండి రూ.40,750కు చేరింది. పరిశ్రమలు, నాణేల తయారీ దారుల నుండి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌కు డిమాండ్ సన్నగిల్లడంతో మదుపరుల దృష్టి బంగారం పైకి వెళ్లినట్లు తెలుస్తోంది. మదుపరులు తమ పెట్టుబడులను బంగారంపై పెట్టేందుకు సుముఖంగా ఉండటంతో బంగారానికి డిమాండ్ పెరిగనట్లు బులియన్ ట్రేడర్లు వెల్లడించారు. మరోవైపు దేశీయమార్కెట్‌లో ఆభరణాల కొనుగోలుకు ఉత్సాహంచూపడం మరో కారణంగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 మరియు 99.5 శాతం స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.330లు పెరిగి రూ.29,030 మరియు రూ.28,880గా నిలిచింది. డిసెంబరు 5న గరిష్టంగా రూ.29,050 ఉన్న బంగారం ధర మరలా అదేస్థాయికి చేరింది. సవరు బంగారం ధర 8గ్రాములు రూ.24,200కు చేరింది.

## 23 నుండి 25వరకు మురమళ్ళలో కోనసీమ ఉత్సవాలు



**రాజధాని ప్రతినిధి కోనసీమ న్యూస్-జీఎన్.రావ్) :** కోనసీమ ఉత్సవాలను ఈ ఏడాది మురమళ్ళలో నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు)తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధి ఐ.పోలవరం మండలం మురమళ్ళలో గోదావరి నది ఒడ్డున జనవరి 23,24.25 తేదిల్లో మూడు రోజుల పాటు కోనసీమ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు తెలిపారు. గత ఏడాది నిర్వహించిన కోనసీమ ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా 3.50లక్షల మంది వచ్చారని, ఈ ఏడాది గత ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు రానున్నట్లు అంచనా వేస్తున్నామని అందుకు తగినట్లు ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రముఖ సినీ నటుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఈ ఉత్సవాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# అంధుల కోసం 'బ్రెయిలీ అట్లాస్'కు రూపకల్పన

- ప్రపంచంలో భారత్‌లోనే ప్రప్రథమం
- తెలుగు,గుజరాతీ, బెంగాలీ, ఆంగ్ల భాషల్లో లభ్యం

**తిరుపతి :** కంటిచూపు కరవైన వారికి ఉపయుక్తమయే అట్లాస్‌ను రూపొందించడం అంత తేలికేం కాదు. అసాధ్యమనుకున్న అట్లాస్‌ను భారత్ సుసాధ్యం చేసింది. అంధుల కోసం ప్రత్యేకంగా ఒక అట్లాస్‌ను రూపొందించింది. దీన్ని బ్రెయిలీ అట్లాస్‌గా పేర్కొంది. ఇలాంటి విస్తృత ఆవిష్కరణ జరగడం ప్రపంచంలో భారత్‌లోనే ప్రపథమం కావడం విశేషం. గర్వకారణం. వివిధ ఆకారాల్లో ఉండే దేశాల మ్యాపులు, గణాంకాలను స్పర్శద్వారా అంధులు గర్తించే విధంగా ఈ అట్లాస్ రూపకల్పన జరిగింది. తద్వారా చూపున్న వారితో సమంగా అంధులు కూడా ప్రపంచ దేశాల సమాచారాన్ని సవివరంగా తెలుసుకునేందుకు మార్గం సుగమమైంది. తొలి విడతగా 500ల కాపీలను ముద్రించారు. ఒక్కోకాపీ వెలను రూ.1,000లుగా నిర్ణయించారు. అట్లాస్‌ను ఆంగ్లం సహా తెలుగు,గుజరాతీ, బెంగాలీ భాషల్లో ముద్రించారు. నైసర్గిక, రాజకీయ నమూనాలను ఇందులో మ్యాపులుగా ముద్రించం ద్వారా అత్యధిక మందికి ప్రయోజనకరంకానుంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల రంగ ప్రవేశం చేసిన తరువాత కోరుకున్న గమ్యస్థానం ఎక్కడుందో తెలుసుకోవడం చూపరులకు తేలికైంది.అదే అంధుల విషయానికి వచ్చేసరికి ఈ వెసులుబాటు లేదు. తాజాగా రూపొందిన అట్లాస్ సాయంతో అంధులు కూడా దేశ,విదేశీ సమాచారాన్ని తమ చేతి వేళ్ల స్పర్శ ద్వారా తేలికగ గుర్తించగలిగే అవకాశాన్ని సాకారం చేసింది. బ్రెయిలీ అట్లాస్ రూపకల్పన కసరత్తు యూవత్తూ కొల్‌కతలోని నేషనల్ అట్లాస్, థీమాటిక్ మ్యాపింగ్ అర్గనైజేషన్ (ఎన్‌ఏటీఎంఒ) ఏళ్ల తరబడి జరిపిన నిర్విరామ కృషికి ప్రతిఫలంగా చెప్పాలి. రూపకల్పనలో శాస్త్ర,సాంకేతిక విభాగం సహాజసహకారాలందించింది. తుదిరూపును ముద్రించి విడుదల చేసింది. సిల్క్ స్క్రీన్ ప్రింటింగ్ విధానంలో గ్లేజింగుతో కూడిన మందపాటి కాగితం మీద ఒక ప్రత్యేక తరహా సాంకేతిక ప్రక్రియ సాయంతో అచ్చులుగా గుద్దడం అట్లాస్ ముద్రణ సాగింది.ఈ అచ్చులను తాకడం ద్వారా ఏ మ్యాపు ఏదేశానిదో తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ఇలాంటి రూపకల్పన ప్రపంచంలో భారత్‌లోనే ప్రప్రథమమని మాజీ భారత సర్వేయరు జనరల్ పృథ్వీష్‌నాగ్ తెలిపారు. ప్రస్తుతం ఆయన వారణాసిలోని మహాత్మగాంధీ కాశీవిద్యాపీఠం ఉపసంచాలకునిగా పని చేస్తున్నారు. ప్రపంచంలో ఇలాంటి అట్లాస్ తయరీకి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని ఆయన చెప్పారు. పూర్తి స్థాయిలో భారీగా ముద్రించగల విధంగా అట్లాస్‌కు రూపకల్పన చేసిన ఘనత మాత్రం భారత్‌దేనన్నారు. ఇదొక ప్రత్యేక విన్నూత ఆవిష్కరణగా ఆయన అభివర్ణించారు. అంధులసాధికారత లక్ష్యంగా శాస్త్ర,సాంకేతిక వినూత్న ఆవిష్కరణకుగాను ఈబ్రెయిలీ అట్లాస్ రూపొందించిన ఎన్ఏటీఎంఒ డైరెక్టర్ తపతీ బెనర్జీని జాతీయ అవార్డుతో తిరుపతిలో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాని నరేంద్రమోడీ సత్కరించాడు. 2015 కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వశాఖ గనాంకాల ప్రకారం భారత్‌లో కోటి 60లక్షల మంది పూర్తి అంధులు,రెండు కోట్ల 80లక్షల మంది పాక్షిక అంధత్వ భాధితులు ఉన్నారు. తాజాగా రూపొందిన బ్రెయిలీ అట్లాస్ సాయంతో వీరంతా దేశ పటాలను, గణాంకాలను తేలికగా తెలుసుకోగలుగుతారు. కాగా, ప్రపంచ వ్యాప్తంగా 285మిలియన్ల మంది దృష్టి లోపాలతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సమాచారం. ఇందులో 39మిలియన్ల మంది పూర్తిగా అంధులు. ప్రపంచ వ్యాప్తంగా దృష్టిలోపాలతో బాధపడుతున్న వారిలో 90శాతంపైగా తక్కువ ఆదాయ వర్గాల్లోనే ఉన్నారు. మున్ముందు దిగుమతి చేసుకున్న తేలిక పాటి,నాణ్యమైన కాగితం మీద ఈ ఆట్లాస్ ముద్రణ కొనసాగించనున్నట్లు బెనర్జీ తెలిపారు.

# 'న్యాయ సంయమనం'జడ్జీల బాధ్యత



### సుప్రీంకోర్టు ప్రకటన

**న్యూఢిల్లీ :** ఏ కేసు విషయంలోనైనా విచారణ అనంతరం తుది తీర్పు వెలువరించే ముందు'న్యాయ సంయమనం' పాటించడం న్యాయమూర్తిల బాధ్యతని సుప్రీంకోర్టు ప్రకటించింది. తీర్పును వెలువరించే ప్రక్రియలో గందరగోళానికి తావిచ్చే విధంగా వ్యవహారించరాదని తెలిపింది. దాడులు కేసు విచారణలో భాగంగా నిందితులు ముగ్గురిని అరెస్టు చేయరాదంటూ హైదరాబాద్ హైకోర్టు వెలువరించే ఉత్తర్వులను నిలిపివేస్తూ న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం ఈమేరకు ఆదేశించంది. దర్యాప్తు ప్రక్రియను లేదా ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్)ను కొట్టివేయాలంటూ దాఖలయే విచక్షణా రహితమైన అసంఖ్యాక పిటీషన్లను తిరస్కరించేందుకు నేరశిక్షాస్మృతి (సీఆర్‌పీసీ) సెక్షను 482 సంక్రమింపజేస్తున్న అధికారాలను కోర్టు వినియోగించకోవచ్చుని వివరించింది. రాజ్యాంగ అధికరణం 226 లేదా సీఆర్‌పీసీ 482 అనుసరించి నిందుతులను అరెస్టు చేయరాదని దర్యాప్తు సంస్థలను ఆదేశించే అధికారం హైకోర్టుకు ఉందని ధర్మాసనంలోని మరొక న్యాయమూర్తి అమితవరాయ్ తెలిపారు. ఈ క్రమంలో 'న్యాయ సంయమనం' పాటించడం న్యాయమూర్తుల బాధ్యతగా ఆయన చెప్పారు. దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్టు చేసేందుకు దర్యాప్తు సంస్థలకు సీఆర్‌పీసీ సెక్షను 482 అవకాశం కల్పిస్తోందా అని ప్రశ్నిస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అభ్యర్థన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పై మేరకు ఉత్తర్వులిచ్చింది. సీఆర్‌పీసీ 438 అమల్లోవున్న రాష్ట్రాల్లో రాజ్యాంగ అధికరణం 226 లేదా సీఆర్‌పీసీ 482కింద దాఖలయే వ్యాజ్యాల విచారణ లేదా తోసిపుచ్చే సందర్భంలో 'న్యాయసంయమనం' పాటించాలని హైకోర్టులకు సూచిస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. వేర్వేరు కేసుల్లో వేర్వేరు సెక్షన్ల కింద నమోదైన కేసు దర్యాప్తులో ముగ్గురు నిందితుల అరెస్టును హైదరాబాద్ హైకోర్టు నిలుపుదల చేయడాన్ని సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషను విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది.

# ఉపాధి హామీకీ ఆధారే

### ఏప్రిల్ 1 నుండి అమలు

**న్యూఢిల్లీ :** గ్రామీణ ప్రాంతాలలో నివసించే పేదలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆధార్ కార్డులు కలిగి ఉండటం అవసరం. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) క్రింద పనిచేసే కార్మికులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆధార్ కార్డులు తప్పనిసరి. ఈ పథకం క్రింద సంవత్సరానికి వంద రోజులు తప్పనిసరిగా కార్మికులకు పనిదినాలు కల్పించాలి. ఉపాధి హామీ పథకం క్రింద నమోదు చేసుకున్న కార్మికులు ఆధార్ కార్డు కలిగిఉన్నట్టు లేదా 2017 మార్చి 31వ తేదీకి ఆధార్ క్రింద నమోదు చేసుకున్న ఆధారాలను సమర్పించాల్సి ఉందని క్యాబినెట్ సెక్రటేరియెట్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా, ఆధార్‌కార్డు పొందే వరకు ఈ పథకం క్రింద ప్రయోజనాలను కార్మికులు పొందేందుకు రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డు, ఫోటోతో కిసాన్ పాస్‌బుక్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ క్రింద జారీచేసిన జాబ్‌కార్డు,గైజిటెడ్ ఆఫీసరు లేదా తహసీల్దార్ జారీచేసిన సర్టిఫికెట్ అర్హమైనవిగా చెప్పారు. ఆధార్ కోసం కార్మికుడు దరఖాస్తు చేసి ఉంటే తాను నమోదుచేసుకున్న స్లిప్, లేదా 12 అంకెల విశిష్ట గుర్తింపు, సంఖ్య పొందేందుకు సంబంధిత అధికారులకు సమర్పించిన దరఖాస్తు ప్రతిని అందజేయాలి. ఈ విధంగా చేయటం ఆ కార్మికునికి గుర్తింపు, దేశంలో ఎక్కడ ఉన్నా చిరునామాకు దానిని పరిగణిస్తారని తెలిపారు.

"ఆధార్ నమోదును తప్పనిసరి చేస్తూ అవసరమైన ఆదేశాలను జమ్మూ-కాశ్మీర్, మరికొన్ని ఇతర రాష్ట్రాలకు కేంద్రం జారీచేస్తుంది, కార్మికులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఆధార్ నెంబరు తీసుకునేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది" అని ఆ అధికారి తెలిపారు. ఇందుకోసం ఆధార్ (లక్షిత ద్రవ్య, ఇతర సబ్సిడీలు, ప్రయోజనాలు,సేవలు) చట్టం 2016లోని 7వ సెక్షన్‌ను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. భారత సంచులిత నిధి (సీఎఫ్ఐ) నుండి ప్రభుత్వం కల్పించే సబ్సిడీలు, లబ్ధి లేదా సేవలను పొందేందుకు వ్యక్తులు తప్పనిసరిగా ధృవీకరణ చేయించుకోవాలని లేదా ఆధార్ నెంబరు కలిగి ఉన్నట్టు ఆధారాలను సమర్పించాలని చట్టంలోని 7వ సెక్షన్ పేర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి గృహస్థునికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో కనీసం వంద రోజులు ఉపాధి హామీ కల్పించే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ క్రింద వయోజనలకు స్వచ్ఛంధంగా అన్‌స్కిల్డ్ పని కల్పించాలి. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.38,500 కోట్లు కేటాయించింది. 2015-16 సంవత్సరానికి గ్రామీణ ఉపాధి పథకం క్రింద చేసే కేటాయింపులను రూ.3,800 కోట్లకు పైగా పెంచారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఆధార్‌కు అనుసంధానించటం తప్పనిసరి చేయటం వల్ల ప్రభుత్వ సబ్సిడీలు, నిధులు పక్కదారి పట్టకుండా చూడటానికి సహాయపడుతుందని, లబ్ధి దారులకు నేరుగా చేరుతుందని మరొక అధికారి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధార్ అనుసంధాన నేరుగా ప్రయోజనాల బదిలీ పథకం (డీబీటీ)లో ఆయన అధికారిగా పనిచేస్తున్నారు.

## దత్తతకు కొత్త నియమాలు

**న్యూఢిల్లీ :** పిల్లలను దత్తత తీసుకునే తల్లిదుంద్రులకు జనవరి 16నుంచి కేంద్ర ప్రభుత్వం కొత్త నియమాలను అమలు చేయనుంది. ఇకపై దత్తత తీసుకునే తల్లిదండ్రులు జాతీయ దత్తత సంస్థ నుంచి మాత్రమే తీసుకోవాలి.దీంతోనే చట్టబద్ధంగా తల్లిదండ్రుల బంధం ఏర్పడుతుందని కేంద్ర దత్తత వనరు సంస్థ (సీఏఆర్ఏ) సీఈఓ లెఫ్టినెంట్ కల్నర్ దీపక్ కుమార్ తెలిపారు. ఈ నియమం ద్వారా బంధువుల పిల్లలను కూడా దత్తత తీసుకునే అవకాశం ఉంది. దత్తత తీసుకున్న వ్యక్తికి దత్తత తల్లిదండ్రుల ఆస్తిలో హక్కు, వయస్సు మళ్లిన సమయంలో వారి బాగోగులచూసే బాధ్యత ఉండదు. దేశంలోని అన్ని దత్తత సంస్థలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సీఏఆర్ఏ నియమాలను పాటించాల్సి ఉంది. మొదట్లో అనాథ,లేదా వదిలివేసిన, లేదంటే అప్పగించిన పిల్లలను మాత్రమే దత్తతకు అనుమతించేవారు. ప్రస్తుతం బందువుల పిల్లలు మొదటి పెళ్లి ద్వారా కలిగిన భార్య లేదా భర్త పిల్లల లేదా పిల్లలకు జన్మనిచ్చిన తలిదండ్రులు అప్పగించిన పిల్లలను దత్తత తీసుకోవచ్చు తమ పిల్లలను దత్తతకు అనుమతించే తల్లిదండ్రులు "బాలల దత్తతకు వనరు సమాచారం, మార్గదర్శక వ్యవస్థ " లో దరాఖాస్తు చేసుకోవాలి. బంధువుల పిల్లలను దత్తత తీసుకోవాలనుక్కు వారు పిల్లల తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఒక వేళ తల్లిదండ్రులను కోల్పోతే శిశుసంక్షేమ కమిటి అనుమతి పొందాలి. తల్లి,లేదా తండ్రి తరుపు బంధువులు, తాతలు దత్తత తీసుకోవడానికి బాలల న్యాయ చట్టం 2015లో దత్తతా నిర్వచనం, నియంత్రణలను పొందుపరిచారు. బంధువులు, అనాధపిల్లలను దత్తత తీసుకోవడానికి వయస్సుతో సంబంధలేదు. హిందూ దత్తత, నిర్వహణా చట్టం 1965లో మాత్రం ఆంక్షలు ఉన్నాయి. దత్తత తీసుకునే తల్లిదండ్రులు బిడ్డకంటే 21 ఏళ్లు ఎక్కువ ఉండాలి.దత్తత తీసుకునే తల్లిదండ్రులకు ఆడపిల్లలు ఉంటే మరొక ఆడబిడ్డను, పిల్లవాడు కలిగి ఉంటే మరొక పిల్లవాడిని దత్తతకు అనుమతించరు. విదేశాల్లో ఉన్న వ్యక్తులు దత్తతకు తీసుకోవాలంటే కోర్టు ఆర్డర్‌ను రాయబార కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ముస్లింలకు, క్రైస్తవులకు, పార్సీలకు దత్తతా చట్టాలు లేవు. 1890 చట్ట ప్రకారం ఒకరిని మాత్రమే పెంపుడు సంరక్షకుడు దత్తత తీసుకోవచ్చు. ఒక్కసారి ఆ బాలిక/బాలుడు మేజర్ అయితే సంరక్షులకు వారికి ఎట్టి బంధం ఉండబోదు. అలాగే వారికి సంరక్షకుల వారసత్వ హక్కు కూడా ఉండదు.

## నాక్ గుర్తింపును ముడిపెట్టాలి

**యూజీ, పీజీ ప్రవేశాలపై నాక్ డైరెక్టర్ డీపీ సింగ్**

**రాజధాని ప్రతినిధి-తిరుపతి :** యూజీ (డిగ్రీ), పీజీ విద్య వ్యాపార దృక్పంథంతో ముందుకు సాగుతోందని, దీనికి కారణం నాక్ గుర్తింపుతో సంబంధం లేకుండా ప్రవేశాలు జరగడమేనని నాక్ డైరెక్టర్ డీపీ సింగ్ పేర్కొన్నారు. ఇస్కా ప్లీనరీ సదస్సులో భాగంగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సీవీ రామన్ ప్రాంగనంలో 'విద్య, పరిశోధన రంగాలలో నాణ్యత అభివృద్ధిలో నాక్ పాత్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించిన డీపీ సింగ్ మాట్లాడుతూ... "రాష్ట్రాల పరిధిలో యూజీ కళాశాలలు, జాతీయస్థాయి పరిధిలో పీజీ, డీమ్డ్ వర్సిటీలు అంటూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చిన్నచిన్న గదుల్లో పదుల కొద్దీ కోర్సులను నిర్వహిస్తున్నాయి వీటన్నింటికీ రాజకీయ శక్తి యుక్తులున్నాయి. ఇలాంటి విద్యాసంస్థలతో నాణ్యత ఎలా సాధ్యం? ప్రపంచస్థాయి పరిశోధనలతో మనం సాటిరాలేం. దీనికి పరిష్కారం ఒక్కటే. యూజీ, పీజీ ప్రవేశాల ప్రక్రియకు నాక్ గుర్తింపును ముడిపెట్టాలి. అప్పుడు ఎలాంటి కళాశాలలో ప్రవేశం పొందాలో విద్యార్థే స్వయంగా తేల్చుకునే పరిస్థితి వస్తుంది. ప్రగతి పథంలో పరిశోధన రంగం ప్రయాణిస్తోంది. భారత్‌లోనూ ఈ పరిస్థితి రావాలి".. అని వివరిచారు. యూజీ, పీజీ విద్య పర్యవేక్షణలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత విద్యాశాఖ, యూజీసీ తీసుకునే నిర్ణయాలు ఉమ్మడిగా, కఠినంగా, భవిష్యత్తుకు మార్గదర్శ కంగా ఉండాలని నాక్ ఛైర్మన్, యూజీసీ సభ్యులు వీరేంద్ర చౌహాన్ సూచించారు. రాష్ట్రాల పరిధిలో యూజీ కళాశాలలకు అనుమతులు మంజూరు చేసే నేపథ్యంలో కేంద్రం ఎంపిక చేసిన నిబంధలను పూర్తిస్థాయి అమలు చేస్తే కొంతమేరైనా అకడమిక్ పురోగతి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం కో-కన్వీనర్ ఆచార్య నారాయణరావు మాట్లాడుతూ ప్లీసరీ సదస్సు ఉద్దేశాలను తెలిపారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య దామోదరం మాట్లాడుతూ నాక్ కమిటీలుచేస్తున్న మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో పాటిస్తే ఫలితాలుంటాయన్నారు. ప్లీనరీ సదస్సులో భాగంగా హాజరైన పలువురు ప్రతినిధులు చర్చకు తెరతీశారు. నాక్ కమిటీలు బహుళ అంతస్థుల భవనాలను చూసి గ్రేడ్‌లను మంజూరు చేసి వెళ్తున్నాయని, దీని సూచనలను పూర్తిస్థాయిలో స్వీకరించి అమలు చేస్తామన్నారు.

## హరిత ప్రాంతాంల్లో సెజ్‌లా!

**ప్రొఫెసర్ ఆర్.రామమూర్తి**

**రాజధాని ప్రతినిధి -తిరుపతి :** హరిత ప్రాంతాలను ప్రత్యేక ఆర్థికమండళ్లకు (సజ్) కేటాయిస్తున్నారని, దీనివల్ల వేల సంఖ్యలో చెట్లను తొలగించి వారు నిర్మాణాలు చేపట్టాల్సి వస్తోందని రీజినల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌పర్టైజ్ (తిరుపతి) ఛైర్మన్, ఎస్వీ విశ్వవి ద్యాలయం విశ్రాంత ఉపకులపతి ప్రొఫెసర్ ఆర్.రామమూర్తి అన్నారు. పచ్చదనం విస్తరించిన ప్రాంతాల్లో సెజ్‌ల కేటాయింపుపై పున:పరిశీలన చేయాలని సూచించారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా వాతావరణ మార్పులతో జీవరాశులపై ప్రభావం అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. సెజ్‌ల కోసం నిరుపయోగ భూములు, చెట్లు లేని ప్రాంతాలను కేటాయించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి 2100 నాటికి ఐదు డిగ్రీల ఉష్ణోగ్రత పెరగనుందని అంచనా వేశారు. దీనివల్ల సముద్ర నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని, జీవరాశులు అంతరించిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కర్బన ఉద్గారాలను అరికట్టే బ్రహ్మదెముడు లాంటి మొక్కలను ఖాళీ స్థలాల్లో పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వైల్డ్‌లైఫ్ డాక్టర్ మాథుర్ మాట్లాడుతూ భూతాపంలో హిమాలయాలు కరిగిపోతున్నాయని, ఇది మంచి పరిణామం కాదని అన్నారు.

# పంటి గారకు నానో చికిత్స

- ఉస్మానియా ఆచార్యుడికి పేటెంట్
- సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శన



'ఎలాంటి బ్రష్‌లు, పేస్టులు వాడినా 10వేల నుంచి లక్షదాకా సూక్ష్మక్రిములు నోట్లో ఉంటాయని. కానీ మేం తయారు చేసిన నానో మిశ్రమాన్ని వాడితే... కచ్చితంగా వాటి సంఖ్య 100కంటే తక్కువకు పడిపోతుంది. గార పోతుంది. అంతేకాకుండా పుప్పిపన్నుగనక ప్రాథమిక దశలో ఉంటే ఈ మిశ్రమంతో నయం చేయవచ్చు. లేదంటే... దంతవైద్యులు చేసే రూట్‌కెనాల్ పక్రియను కూడా ఇది సులభతరం చేస్తుంది. ఐదారుసార్లకు కావల్సిన పనిని రెండుసార్లలో ముగించవచ్చు.' ఎంతబాగా బ్రష్ చేసినా పళ్ళకు గారపడుతోంది... ఎంత జాగ్రత్తపడ్డా పిప్పిపన్ను వచ్చిందని బాధ పడేవాళ్ళు చాలామంది. అలాంటివారందరికీ ఉపశమనంలా.. నానో టెక్నాలజీతో కూడిన అయస్కాంత పరిష్కారంతో ముందుకొచ్చారు ఉస్మానియా విశ్వవిద్యాలయం నిజాం కళాశాల ఆచార్యుడు డాక్టర్ చాంద్‌బాపాషా! మనం వాడే టూత్‌పేస్టు, బ్రష్‌ల్లో అయస్కాంత లక్షణాలతో కూడిన నానో పదార్థాన్ని చేర్చి ఆయన చేసిన ప్రయోగాన్ని కేంద్ర శాస్త్రసంకేతిక మంత్రిత్వశాఖ కూడా ప్రశంసించి ఆమోదించింది. మన నోటిలోని బ్యాక్టీరియా నుంచి ఎలా బయటపడవచ్చో తెలిపే ఈ ప్రయోగాన్ని తిరుపతిలో జరుగుతున్న జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించి వివరించారు. ఎప్పటికప్పుడు నోటిలో ఉత్పత్తయ్యే తాత్కాలిక సూక్ష్మక్రిములు కొన్నైతే... అక్కడే స్థావరం ఏర్పరచుకునేవి మరికొన్ని! మనం బ్రష్ చేసినప్పు తాత్కాలిక క్రిములు వెళ్ళిపోతాయి. కానీ ఎంతబాగా బ్రష్ చేసినా నోటిలో కొంత బ్యాక్టీరియా మిగిలిపోతుంది. ఈ బ్యాక్టిరియా 20 నిమిషాల్లో పళ్ళపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇవి లాక్టిక్, అసిటిక్ యాసిడ్లను ఉత్పత్తి చేస్తాయి. పళ్ళపై ఎనామిల్ పొర కరిగి... క్రమంగా గార పడతాయి. పళ్ళు పుచ్చిపోవటం కూడా జరుగుతుంది. కొన్ని కుటుంబాల్లో జన్యుపరంగా కూడా పుప్పి పళ్లు వస్తుంటాయి. దీన్ని నివారించటానికి చాంద్‌పాషా, ఆయన బృందం నానో పదార్థాలతో కూడిన పరిష్కారాన్ని కనుగొంది. ధనావేశంగల అయస్కాంత నానో పదార్థాలను టూత్‌పేస్ట్, మౌత్‌వాష్‌ల్లో 0.1 శాతం కలిపారు. ఇందులో అయస్కాంత ప్రభావంగల ఐరన్, ధనావేశంగల ఇమైన్ అనే పదార్థం ఉంటాయి. ఇది కలిసిన టూత్‌పేస్ట్ మిశ్రమాన్ని నోట్లో వాడినప్పుడు... ధనావేశంగల ఇమైన్ రుణావేశంగల నష్టంచేసే స్ట్రెప్టోకాకస్ మ్యుటాన్స్ సూక్ష్మక్రిములతో బంధనం ఏర్పరచుకుంటుంది. అలా అయ్యాక... టూత్‌బ్రష్‌కు అమర్చిన అయస్కాంత క్షేత్రాన్ని క్రియాశీలం చేస్తారు. ఇందుకోసం బ్రష్ చివర్లో చిన్న బటన్‌లాంటి ఏర్పాటు ఉంటుంది. అయస్కాంత నానోపదార్థం లోపలున్న సూక్ష్మక్రిములన్నింటినీ బయటకు తీసుకొస్తుంది. బయటకురా గానే కడిగినా, లేదంటే బ్రష్ చివర్లోని బటన్‌ను నొక్కటం ఆపేసినా సూక్ష్మక్రిములు బ్రష్‌ను వదిలేస్తాయి. నిజాం కళాశాలలో మైక్రోబయాలజీ, జెనటిక్స్, బయోటెక్ విభాగాల అధిపతిగా పనిచేస్తున్న చాంద్‌పాషాకు దీనిపై పేటెంట్ కూడా లభించింది. త్వరలోనే దీన్ని వాణిజ్యపరంగా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రశాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ కూడా హామీ ఇచ్చింది. ప్రజలకు ఉపయోగపడే ఈ పదార్థాన్ని ఎవరు ముందుకొచ్చినా... ఉచితంగా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నట్లు చాంద్‌పాషా తెలిపారు.

## జెరూసలేం యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

**ఆనందపేట :** క్రైస్తవుల నవిత్ర స్థలం జెరూసలేం సందర్శించేందుకు వెళ్లే వారికి జెరూసలేం పథకం కిందట రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.40 వేల చొప్పున సాయం అందించనున్నట్లు ఏపీ క్రైస్తవుల ఆర్థిక సంస్థ కార్యనిర్వాహక సంచాలకుడు కేవీ విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రకు వెళ్లదలిచిన వారు 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దారులు కనీసం రెండేళ్ల కాలపరిమితి ఉన్న పాస్‌పోర్ట్ కలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తుచేయగా వచ్చిన కాపీని తాడేపల్లిలోని మణిపాల్ హాస్పటల్ ఎదురుగా ఏపీఎస్‌సీఎంఎఫ్‌సీ కార్యాలయంలో అందించాలని సూచించారు. వివరాలకు 7396284529, 9000604064, 0863-2271678 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## తిరుమలలో భూటాన్ యువరాజు తల్లి, మనవడు

**తిరుమల :** భూటాన్ దేశ రాణి తల్లి దోర్జీవాంగ్మో తన మనవడు వెరోచానారింపోచేతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందించారు. ఆలయ సంప్రదాయాలు, వైదిక ధర్మాలు వివరించారు.

**భారత్‌లో నా మనవడి గత జన్మ ఆనవాళ్లు : దోర్జీవాంగ్మో**

తన మనవడు వెరోచానా రింపోచే గత జన్మ ఆనవాళ్లు భారత్‌లో కనిపించటం ఆశ్చర్యంగా ఉందని భూటాన్ దేశరాణి తల్లి దోర్జీవాంగ్మో అన్నారు. ఆయన 8వ శతాబ్దంలో ఇక్కడ జన్మించారని, ఆయన సూచనలతో ఇప్పటికే నలంద, నాగార్జునకొండ ప్రాంతాల్లో పర్యటించామన్నారు. అక్కడ అలాంటి ఆనవాళ్లు ఉండటం చాలా ఆశ్చర్యం కలిగించిందన్నారు.

## 13న క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

**రాజధాని ప్రతినిధి , గుంటూరు :** గుంటూరు మార్కెట్ సెంటర్లోని సెయింట్ మాథ్యూస్ లూథరన్ వెస్ట్ ప్యారిష్ చర్చిలో ఈ నెల 13న క్రైస్తవ వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కిరణ్మయి ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీలతో పాటు అన్ని సామాజిక వర్గాల్లోని కన్వర్టెడ్ క్రిస్టియన్ వధూవరులు తమ తల్లిదండ్రులతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకూ జరిగే పరిచయ వేదికకు హాజరుకావాలని కోరారు. హాజరుకానున్న వధూవరులు బయోడేటా, ఫోటోలతో రావాలని సూచించారు. వివాహ పరిచయ వేదికకు హాజరైన వారికి వెయ్యి మందికి పైగా వధూవరుల వివరాలతో కూడిన బుక్‌లెట్ అందిస్తామని తెలిపారు. పరిచయ వేదికలో పేర్లు నమోదు చేసుకున్న వారికి ఆన్‌లైన్ వెబ్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వివరాలకు సెల్ : 90006 24251,94945 34901 పంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## కోనసీమ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురు



**రాజధాని ప్రతినిధి (కోనసీమ -జిఎన్.రావ్) :** కోనసీమ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అమలాపురంలో జిల్లా కమిటీ సభ్యుడు ఖ్వాజాబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అమలాపురం జోన్ ఎన్నికలు నిర్వహించారు. జోన్ అధ్యక్షుడిగా ఈసకోను గురు రెండవసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన గురు మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడు వాసంశెట్టి రమణప్రసాద్, కార్యదర్శి పాయసం దుర్గాప్రసాద్(రాజు), కోశాధికారి యాళ్ల నాగేశ్వరరావు, సిహెచ్.గణేష్, సలాది కృష్ణారావు, గూటం శ్రీను, దేవరపల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల నాగు, రఘు, పిట్టల కృష్ణ, డిజిటల్ రవి, కెవిఆర్.రాజు, ఉషాకిరణ్‌రాజు, కాశి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# సన్నద్ధతలేని రేషన్ పంపిణీ

# సంక్రాంతి కానుక పంపిణీలో సమస్యలు

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** అధికారులు ముందుచూపులేకుండా రేషన్ సరకుల పంపిణీలో ప్రవేశపెట్టిన నగదు రహిత విధానం అమలు ఒక ప్రహసనంగా మారింది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల పేద కార్డుదారులు అటు చౌకధరల దుకాణాలు, ఇటు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు, డీలర్లు, బ్యాంకర్ల మధ్య సమన్వయలేమి, ఈ-పోస్ యంత్రాల ప్రధాన సర్వర్, ఆధార్ బ్యాంకింగ్ డేటాబేస్‌లు ఒకదానితో ఒకటి సకాలంలో అనుసంధానం కాకపోవడంవల్ల కార్డుదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో ప్రతి నెల ఐదో తేదీ నాటికి 60 శాతం కార్డులకు పూర్తయ్యే సరకుల పంపిణీ ఈసారి 40 శాతం కార్డులకు కూడా జరగకపోవడం సమస్య తీవ్రతను చాటుతోంది. సరకులను నగదు రహిత పద్ధతిలోనే చేయారా, నగదుపై కూడా చేయొచ్చా అనే స్పష్టత డీలర్లకు లేకపోయింది. నగదు రహిత లావాదేవీల నిర్వహణకు ప్రాథమిక అవసరం బ్యాంకు ఖాతా. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.34 కోట్ల మంది తెలుపురంగు కార్డుదారుల్లో ఖాతాలు ఎంత మందికి ఉన్నాయి, ఎంత మందికి లేవు, ఖాతాలు ఉంటే అవి ఆధార్‌తో అనుసంధానమయ్యాయా, లేదా అనే కనీస సమాచారం కూడా పౌరసరఫరాలశాఖ వద్ద లేకపోయింది. నవంబరు చివరి నుంచే కసరత్తు చేస్తున్నా కొలిక్కి రాలేదు. ఇలాంటి పరిస్థితిల్లో నగదుపైనే సరకులు పంపిణీ చేయండని డీలర్లకు స్పష్టం చేసి ఉండొచ్చు. అలా చేయలేదు. ప్రభుత్వం అవగాహన కల్పించక పోవడంవల్ల కార్డుదారులకూ స్పష్టత లేదు. దుకాణం వద్దకు వచ్చాక నగదు రహిత



పద్ధతిలోనే సరకులు ఇస్తామని డీలర్లు చెబుతుండటంతో వారు కంగుతింటున్నారు. చేసేది లేక బ్యాంకుల వద్దకు పరుగుతీస్తున్నారు. సరకుల విలువ మేర డబ్బు తమ ఖాతాలో ఉందో, లేదో తెలుసుకునేందుకు, ఖాతాల్లో కనీస నిల్వ ఉంచేందుకు, ఆధార్ అనుసంధానం కోసం పనులు మానుకుని బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. డిసెంబరులో అరువుపై సరకులు ఇచ్చారు. ఆ మొత్తం, జనవరి నెల సరకుల మొత్తం రెండూ కలిపి ఇప్పుడు కార్డుదారుల బ్యాంకు ఖాతాల నుంచి డీలర్ల ఖాతాలకు బదలాయింపు జరిగేలా సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. ఇక్కడ మరో సమస్య ఉత్పన్నమైంది.

**డబ్బులు రెండుసార్లు కట్**

డిసెంబరులో కొంత మంది నగదు చెల్లించే సరకులు తీసుకున్నారు. వారికిప్పుడు చిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. జనవరి నెల సరకులు తీసుకున్నప్పుడు వారి బ్యాంకు ఖాతాల నుంచి వీటి విలువతో పాటు డిసెంబరు నెల సరకుల విలువ కూడా ఉపసంహరణ (కట్) అవుతోంది. తామెందుకు రెండు సార్లు డబ్బులు చెల్లించాలంటూ కార్డుదారులు లబోదిబోమంటున్నారు. ఈ పరిణామాలతో అధికారులు డిసెంబరులో నగదుపై సరకులు తీసుకువెళ్లిన వారి జాబితాను రూపొందించే పనిలో పడ్డారు.

**కార్డుదారులు, డీలర్ల మధ్య గొడవ**

సరకుల పంపిణీ సమయంలో కార్డుదారు వేలిముద్రను డీలరు ఈ-పోస్ యంత్రంపై తీసుకుని, సరకుల వివరాలను అందులో పొందుపరుస్తారు. అప్పుడు వాటి విలువతో కూడిన రసీదు వస్తుంది. ప్రస్తుతం చాలా చోట్ల ఈ రసీదులో 'లావాదేవీ తిరస్కరణ (ట్రాన్సాక్షన్ డిక్లైన్)' అని సమాచారం వస్తోంది. కార్డుదారు బ్యాంకు ఖాతాలో మాత్రం వారికి రావాల్సిన సరకుల విలువకు సమానమైన మొత్తం తగ్గిపోతోంది. అది డీలరు ఖాతాలో జమ కావడం లేదు. ఈ పరిస్థితి డీలర్లు, కార్డుదాల మధ్య అన్ని చోట్ల ఘర్షణలకు దారి తీస్తోంది.

**వేలిముద్ర తీసుకోని సర్వర్**

గత ఏడాది ఈ-పోస్ యంత్రాల్లో సాధారణ రేషన్ సరకులకు, పండగ కానుకకు ఒకసారి కార్డుదారు వేలిముద్ర తీసుకుంటే సరిపోయేది. ఈసారి సాధారణ సరకులకు, సంక్రాంతి కానుకకు రెండింటికీ వేలిముద్రలు తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో మరో సమస్య తలెత్తింది. ఒకసారి వేలిముద్ర తీసుకున్నాక రెండోసారి వేలిముద్రను సర్వర్ స్వీకరించడం లేదు.

# నదుల అనుసంధానం ప్రకృతి విరుద్ధం

- నీటి సంరక్షణకు విప్లవాత్మకమైన చర్యలు చేపట్టాలి
- 'నీరు-అభివృద్ధి పరిరక్షణ' సదస్సులో మెగసెసె అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** నదుల అనుసంధానం ప్రకృతికి విరుద్ధమని, నీటి సంరక్షణకు అందరూ నడుం బిగించాలని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత, వాటర్‌మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ కోరారు. 28వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా ఆదివారం 'నీరు-అభివృద్ధి పరిరక్షణపై' ఎమెస్కో సంస్థ అధినేత విజయ్ కుమార్ అధ్యక్షత సదస్సు జరిగింది. దీనికి ప్రధానకర్తగా హాజరైన రాజేంద్రసింగ్ మాట్లాడారు. మనసు, గుండెలతో నదులను అనుసంధానం చేసుకోవాలేగానీ, సాంకేతికపరంగా కాదని హితవు పలికారు. ప్రభుత్వాల అంకితభాకంగా తోనే సమాభివృద్ధి జరుగుతుందనీ, సాంకేతికంగా నదులను అనుసంధానించడం వల్ల దుష్ఫలితాలు ఎదురవు తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ఒక అందమైన రాష్ట్రమని, తమ రాజస్థాన్ కంటే మెరుగైన నీటి వనరులున్నాయని వివరించారు. రాజస్థాన్‌లో 200 మిల్లీమీటర్ల వర్షం పడితే, ఏపీలో అధికంగా 1000 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదయ్యేదని చెప్పారు. నీటి సంరక్షణలో ప్రభుత్వాలు పూర్తిగా వెనుకబాటులో ఉన్నాయని, విప్లవాత్మకమైన చర్యలు చేపడితేనే దేశార్థికాభివృద్ధి కొనసాగుతుందని సూచించారు. రాజస్థాన్‌లో నీటి సంరక్షణకు చేపట్టిన ఉద్యమాలతో కరవుకు ఆ రాష్ట్ర ప్రజలంతా దూరంగా ఉన్నారని చెప్పారు. 200 ఏళ్ల వరకూ రాజస్థాన్‌లో వర్షాలు లేక ఎడారిగా ఉండేదని గుర్తుచేశారు. 32 ఏళ్ల క్రితం అక్కడ కరవు పరిరక్షణ కోసం చేపట్టిన సంస్కరణలతో నీటి పొదుపునకు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. దీంతో రాజస్థాన్‌లో వర్షాలు పడుతున్నాయని, 11,800 చిన్న డ్యామ్‌ల ద్వారా నీటి పొదుపునకు చర్యలు తీసుకున్నామని, కూరగాయ పంట సాగుకు కృషి కొనసాగుతోందని వివరించారు. దేశంలో అభివృద్ధి పేరిట పొగరు పెరిగిందని, విద్యా వ్యవస్థ, సాంకేతిక విధానాల ధోరణులతో నదులను మారుస్తామన్న ఆలోచనలను ప్రజల్లోకి ప్రభుత్వాలు తీసుకొస్తున్నాయన్నారు. గణాంకాల చక్రాల వ్యూహంలో మనమంతా ఇరుక్కుపోతున్నాయని, విశ్వవిద్యాలయాల్లో నీటి సంరక్షణపై చేస్తున్న పరిశోధనలు బలహీనంగా ఉంటున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఉప్పునీటిని మంచినీటిగా మార్చగల శక్తి మనిషికంటే ఒక్క సూర్యుడికే ఉందని స్పష్టం చేశారు. మానవులు మాత్రం నీటిని శుద్ధి చేయడంపోయి, దాన్ని మురికి చేసేందుకే నిర్జీవంగా కుదించడం, అనుసంధానించడం తరహా చర్యలతోనే వరదలు, కరవుల బారిన గ్రామాలు పడుతున్నాయని అన్నారు. నీటి సాక్షరత కోసం అందరూ ఉద్యమించాలని, ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని సూచించారు. పోలవరం పుస్తక రచయిత, పరిశోధకులు ఉమామహేశ్వరి మాట్లాడుతూ, గోదావరి,కృష్ణా నదులకూ ప్రాణం ఉంటుందని, ప్రజలంతా వాటిని ఒక తల్లిలాగా చూసుకోవాలని ఉండవల్లి ప్రసన్నకుమార్, రిటైర్డు ఐఎఫ్ఎస్ అధికారి భాస్కర రమణమూర్తి, మధులతరెడ్డి పాల్గొన్నారు.

## సేంద్రియమే శ్రేయస్కరం

**ప్రొఫెసర్ బి.బి.కాళీవాల్**

**రాజధాని ప్రతినిధి-తిరుపతి :** వ్యవసాయంలో ప్రమాదకర క్రిమిసంహారక మందులను వాడటం పలు విపత్తులకు దారితీస్తోందని కర్ణాటక రాష్ట్రం దావణగెరె విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బి.బిజకాళీవాల్ ఆందోళన వ్యక్తంపై సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశంలో ఉత్తరాదికన్నా దక్షిణాదిలో అత్యధికంగా క్రిమిసంహారక మందులను వ్యవసాయంలో వాడుతున్నారన్నారు. ఈ మందుల వల్ల మూత్రపిండాలు, గుండె, కాలేయం, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వస్తున్నాయన్నారు.

## ఘనంగా తంబి ఉత్సవాలు

**హాజరైన భక్తకోటి**

**ఉంగుటూరు :** పెద అవుటపల్లిలోని జోసఫ్ తంబి ఆలయంలో ఈ నెల 13 నుంచి 15 వరకు తిరునాళ్లను ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. బ్రదర్ జోసఫ్ తంబిని దైవసేవకుడిగా భావించే క్రైస్తవ విశ్వాసులు ఆయన 72వ వర్ధంతిని మూడు రోజులు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధంచేశారు. ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా రెవెన్యూ, పోలీస్, చర్చి పాలకవర్గ సభ్యులు, పంచాయతీవారు, వివిధ స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ ఇన్నా రెడ్డి వట్టి వివరించారు. ఉత్సవాలు జరిగే మూడు రోజుల్లో ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రోజూ దివ్య బలిపూజలు, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారు.

## విశాఖ, తిరుపతి, కాకినాడలకు ప్రత్యేక రైళ్లు

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విశాపట్నం, తిరుపతి, కాకినాడలకు ఏడు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్-విశాఖపట్నం, సికింద్రాబాద్-కాకినాడ పోర్టు, కాకినాడ పోర్టు-తిరుపతి, హైదరాబాద్-తిరుపతిలకు ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన రైలు నెం.07449 సికింద్రాబాద్-కాకినాడ పోర్టు (వయా భీమవరం), హైదరాబాద్-తిరుపతి-హైదరాబాద్ (02764, 02763) సర్వీసులు ఈ నెల 13,14 తేదీల్లోను, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్ (07148,07147) సర్వీసులు ఈ నెల 15,16 తేదీల్లో, కాకినాడ పోర్టు-తిరుపతి -కాకినాడ పోర్టుకు (07941,07942) సర్వీసులను ఈనెల 12,13 తేదీల్లో నడుపుతారు. మధురై-విజయవాడల మధ్య కూడా రెండు రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. మధురై-విజయవాడ (06069) రైలును ఈనెల 14న, విజయవాడ-మధురై రైలును 16ననడిసేందుకు ఏర్పాట్లు చేశామని ప్రకటించారు.

# కొడుకు చనిపోయాడని తల్లితండ్రుల ఆత్మహత్య

**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** ఒక్కగానొక్క కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో అతని స్మృతులను తలచుకుంటూ తల్లిదండ్రులు కూడా తనువుచాలించిన విషాద ఘటన గుంటూరు నగరంలో చోటుచేసేకుంది. పట్టాభిపురం రెండోలైన్‌లో నూనె చంద్రశేఖర్ (43), భార్య నవీన (39) ఫ్యాన్సీషాపును నడుపుకుంటూ జీవిస్తున్నారు. వీరికి తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు వంశీకృష్ణ ఉన్నాడు. చంద్రశేఖర్‌తో పాటే అతని తల్లిదండ్రులైన సుబ్రహ్మణ్యం, నారాయణమ్మ నివాసం ఉంటున్నారు. వంశీకృష్ణ గుంటూరు రూరల్ పరిధిలో ఓ కార్పొరేటు స్కూలు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాడు. వంశీకృష్ణకు జ్వరం రావడంతో స్కూలు యాజమాన్యం ఆసుపత్రకి తీసుకువెళ్లకుండా నిర్లక్ష్యం చేశారని, అందువలనే తమ కుమారుడు గత ఏడాది నవంబరు 22న మృతిచెందారని వారు అప్పట్లో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. స్కూలు యాజమాన్యం మాత్రం తమ తప్పేమీ లేదని, ఆసుపత్రికి తీసుకువెళ్లామని చెబుతున్నారు. దీనిపై పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్, నవీనలు మాత్రం బాలుని జ్ఞాపకాలను తలచుకుంటూ కుంగిపోయారు. అందరూ నిద్రపోతుండగా, తెల్లవారుఝామున 5గంటల ప్రాంతంలో చంద్రశేఖర్ తల్లిదండ్రులు వారిని లేపేందుకు వెళ్లగా ఇద్దరు వంటగదిలోని ఫ్యాను కొక్కానికి వేలాడుతూ కనిపించారు. స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించేందుకు యత్నించగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు మృతదేహాలను మార్చురీకి తరలించారు. మార్చురీ వద్దకు వచ్చిన విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, సీపీఎం నాయకులు పాశం రామారావు, వైసీపీ నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, మృతుల కుటుంబీకులు కలిసి అక్కడే ధర్నా చేశారు. స్కూలు యాజమాన్య బాధ్యత వహించి న్యాయం చేయాలని డిమాండు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. అధికారులు వచ్చి సమస్యలు సానుకూలంగా పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామనడంతో ధర్నాను ఉపసంహరించుకున్నారు.

## 22 నుంచి స్వరాజ్య మైదానంలో

## శ్రీవారి నిత్యోత్సవాలు

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** స్వరాజ్యమైదానంలో ఈనెల 22 నుంచి 28 వతేదీ వరకు ఏడురోజుల పాటు సాప్తాహ్నిక దీక్షగా శ్రీలక్ష్మి శ్రీనివాస వాసవీ సేనాసమితి అధ్వర్యంలో శ్రీలక్ష్మి పౌండరీక యజ్ఞసహిత శ్రీవారి నిత్యోత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని రాజగోపురం వద్ద సమితి నిర్వాహకులు ఆవిష్కరించారు. దూపుగంట్ల శ్రీనివాసరావు, మానేపల్లి లక్ష్మీకుమారి, మామిడి లక్ష్మీవెంకట కృష్ణారావు, కోపూరి పూర్ణచంద్రరావు, ఉదయగిరి శ్రీనివాస బాబు,రెడ్డి ఉమామహేశ్వరగుప్త, గరిమెళ్ళనానయ్య చౌదరిలు కార్యనిర్వాహకులుగా ఉన్నారు. ప్రతిరోజూ రాత్రి 8 గంటల సమయంలో రోజుకొక వాహనం, పెద్దశేషవాహం,సర్వభూపాల వాహనం, ముత్యపుపందిరి వాహనం, గరుడవాహనం, హనుమంతవాహనంపై శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసుడి ఊరేగింపు కన్నుల పండువగా జరుగుతుంది.

## ముక్కోటిని డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణ

**రాజధాని ప్రతినిధి కోనసీమ, జిఎన్.రావ్ :** అమలాపురంలో ప్రసిద్ధి చెందిన శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ముక్కోటిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండి భక్తులు వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనం చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్తర ద్వార దర్శనానికై బారులు తీరారు. తీర్థపు బిందె తీసుకువచ్చి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారికి చామంతి పువ్వులతో పూజలు నిర్వహించారు. పాణింగపల్లి సూర్యనారాయణాచార్యులు, పెద్దింటి సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామి-అమ్మవార్లకు భక్తుల సమక్షంలో శాంతి కల్యాణం నిర్వహించారు. గరుడ వాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆయన సతీమణి అనురాధ, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, వైస్‌చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు తదితరులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి పరమట వీరరాఘవులు, అమలాపురం ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, ఏఎంసి మాజీ చైర్మన్ అల్లాడ సోంబాబు,



మున్సిపల్ ప్రతిపక్షనేత చెల్లుబోయిన శ్రీనివాస్, కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, మాజీ కౌన్సిలర్ జంగా అబ్బాయివెంకన్న, డిఎస్పి ఎల్.అంకయ్య, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 6వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ కర్రి రామస్వామి(దత్తుడు), ఆలయ ఈవో వివివిఎస్ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ఆచంట మూలాస్వామి, తోట విశ్వేశ్వరరావు, బసవా సింహాద్రి, తిక్కిరెడ్డి సురేష్‌కుమార్, పేరూరి విజయలక్ష్మి, రేపాక సత్యనారాయణ తదితరుల ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో శంకు చక్ర నామాలు, సహస్ర దీపార్చన నిర్వహించారు. ముక్కోటికి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగిన కార్యక్రమాలన్నింటిని తొలిసారిగా డ్రోన్ కెమెరాలను ఉపయోగించి చిత్రీకరించారు.

# ఇంటింటా సంక్రాంతి సంబరాలు

## భోగి మంటలు



మూడు రోజుల పాటు సాగే సంక్రాంతి పండుగలో మొదటి రోజున నాలుగు మార్గాల కూడలిలోవేయబడే పెద్ద మంట. అప్పటి నుండి ఇంతకంటే మరింత వేడితో ఉత్తరాయణ సూర్యుడు రాబోతున్నడనే సంకేతం. దక్షిణాయనంలో ఉండే నిద్ర బద్ధకంతో సహా దగ్ధం చేయాలనే సంకేతతంతో చీకటితోనే భోగిమంట వేస్తారు. ఇంట్లో ఉండే పాత కలప సామాన్లు వస్తువులు, ఎండుక్కొలు లాంటివి భోగి మంటలో వేసే తగుల బెడతారు. వీటన్నిటిని దారిద్ర్య చిహ్నాలుగా భావించి తగులబెట్టాలంటారు. వేసవిలో వేడికి తగులబడే వాటిని గుర్తించాలనే మరొక సంకేతం కూడా ఇందులో దాగి ఉంది.

**భోగిపళ్ళు :** భోగి పండుగ అంటే రేగు పండ్లు. ఇది సూర్యునికి ప్రీతిపాత్రమైన పండుగ. సూర్యుని రూపం, రంగు, పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలను కలిపి పిల్లల తలపై పోస్తారు. సూర్య భగవానుని అనుగ్రహం పిల్లలపై ప్రసరించి ఆరోగ్యం కలగాలనే సంకేతంతో భోగి పండ్లు పోస్తారు.

**భోగి :** దీనిని సాధారణంగా జనవరి 14న జరుపుకుంటారు. ఈ రోజు ఉదయం తెల్లవారక ముందే అందరూ లేచి భోగి మంటలు వెలిగిస్తారు.దీనిని సంవత్సరంలో ఆ కాలంలో ఉండే చలి పారద్రోలటానికే కాక ఇంకో సందర్భంగా కూడా జరుపుకుంటారు. ఇంట్లో ఉండే పాత చీపుర్లూ, తట్టలూ, విరిగిపోయిన బల్లలూ వగైరాలను వదిలేసి, కొత్త వాటితో నిత్య నూతన జీవితం ఆరంభించటానికి గుర్తుగా కూడా ఈ రోజు మంటలు వేస్తారు. సాయంత్రం పూట చాలా ఇళ్ళలో స్త్రీలు, చిన్న పిల్లలు బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తారు. దీనిలో పిల్లలు తమ దగ్గర ఉన్న వివిధ రకాల ఆటవస్తువులను ప్రదర్శనగా ఉంచి ఆనందిస్తారు. ఇంకొంత మంది భోగి పళ్ళ పేరంటం ఏర్పాటు చేస్తారు. ఇక్కడ పేరంటాళు ౖ మరియు బంధువులు సమావేశమై రేగిపళ్ళు,శెనగలు,పూలు,చెరుకుగడు కొన్ని నాణాలను కొత్త బట్టలు వేసుకున్న పిల్లలపై ఆశీర్వాద సూచకంగా కుమ్మరించి దిష్టి తొలగిస్తారు. ఈ పేరంటానికి వచ్చిన వారికి తాంబూలలతో పాటు పట్టుబట్టలు,పసుపు,కుంకుమలు పెట్టడం ఆనవాయితీ అన్నారు.



సంక్రాంతి పండుగ వచ్చిందంటే యావత్ దేశం పులకరించి అందాలతో తొణికసలాడుతోతుంది.– ప్రకృతి మాత కూడా సంక్రాంతి శోభతో ఒక నూతన అందం సంతరించుకుంటుంది. ప్రకృతి మాత కూడా సంక్రాంతి శోభతో ఒక నూతన అందం సంతరించుకుంటుంది. పొలాల్లో ఎటు చూసినా పంటకు వచ్చిన సస్యములతో చూచుటకు కన్నుల పండువగా ఉండే పండుగ సంక్రాంతి.ప్రకృతి అంతా ఒక నూతన చైతన్యంతో పులకించే కాలం ఇది. అందుకే శ్రీనాథ మహా కవి దీనిని పెద్ద పండుగ అని అభివర్ణించారు. పెద్దల నుండి పిల్లల వరకు అందరూ తమతమ ఇష్టదైవాలకు మొక్కుకుని ఆశీస్సులు పొందే పుణ్యకాలం గనుక దీనికి మొక్కుల పండుగ అని కూడా పేరుంది. " సంకురమయ్య" అనే సంక్రాంతి పురుషుడు తూర్పు ఆకాశంలో దర్శనం యిస్తాడు. గనుక సంకురమయ్యే చల్లని చూపు కావలసిన పండుగగా " సంకు –రాతిరి " పండుగ అయ్యింది. ఆధ్యాత్మికంగా చూస్తే సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కామే మరకర సంక్రమణము.మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభం అవుతుంది. ఆ తరువాత ఇది ఆరు మాసాలు ఉంటుంది. ఈ కాలంలో శారీరక పరిశ్రమకు,పూజలకు, సాధనలకు,కృషికి అనువుగా ఉంటుంది. ఆంధ్రులకు పెద్ద పండుగ సంక్రాంతి. ఇది కొన్ని ప్రాంతాలలో భోగి,మకర సంక్రమణం, కనుమ అని మూడు రోజులు జరుపుకుంటారు. ఇతర ప్రాంతాలలో నాలుగు రోజులు జరుపుకుంటారు. ముఖ్యంగా పంట చేతికి వచ్చిన ఆనందంలో రైతులు ఈ పండుగ జరుపుకుంటారు. కాబట్టి రైతుల పండుగగా కూడా దీన్ని అభివర్ణిస్తారు. నిజానికి ధనుర్మాసారంభంతోనే నెలరోజులు మామూలుగానే సంక్రాంతి వాతావరణం చలిచలిగా తెలుగు నాట ప్రారంభమవుతుంది. ఆ నెల రోజులు తెలుగు పల్లెలు ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా అలరారుతాయి. బుడబుక్కలు వాళ్ళు, పగటి వేషధారులు, రకరకాల జానపద వినోద కళాకారులు తయారవుతారు. ఈ పండుగకు దాదాపు నెల రోజుల ముందు నుంచే ప్రతీ రోజు తమ ఇళ్ళ ముంగిళ్ళను రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. ముగ్గులు వేయడానికి ప్రత్యేకంగా బియ్యపు పిండిని వాడతారు. కళ్ళం నుంచి బళ్ళ మీద ధాన్యం బస్తాలు ఉంటాయి. భోగినాడు భోగి మంట విధిగా వేయలసిందే. ఆ సాయంత్రం పేరంటంలో పిల్లలకు భోగిపళ్లు తప్పవు. ఈ పెద్ద పండుగకు కొత్త అల్లుడు తప్పనిసరిగా అత్తవారింటికి వస్తాడు. మరదళ్ళు ఎకసెక్కాలకు ఉడుక్కుంటాడు. కోడి పందాలు, ఎడ్ల బళ్ళ పందాలు జరుగుతాయి. ఇవన్నీ సంక్రాంతి పండుగకు శోభ చూకూర్చే సర్వసామాన్య విషయాలు.

## సంక్రాంతి



రెండవ రోజయిన సంక్రాంతి రోజున పాలు పొంగించి.దానితో మిఠాయిలు తయారుచేస్తారు. దాదాపుగా అందరి ఇళ్ళలో అరిసెలు, బొబ్బట్లు,జంతికలు, చక్కినాలు,పాలతాలుకలు, సేమియా పాయసం,పరమాన్నం,పులిహోర, గారెలు మొదలయిన వంటకాలు చేసి కొత్త బట్టలు ధరించి పండుగను ఆస్వాదిస్తారు. ఈ రోజున పితృదేవతలకు తర్భణాలు వదులుతారు. ప్రతీ సంక్రమణానికి పితృతర్భణాలు ఇవ్వాలి. కాని మిగిలిన పదకొండు సంక్రమణాలకు ఇవ్వక పోయినా, ఈ మకర సంక్రమణానికి మాత్రం తప్పకుండా పితృ తర్పణాలు ఇస్తారు. సంక్రాంతి రోజులలో మనము చూసే ఇంకో సుందర దృశ్యం గంగిరెద్దులను ఆడించే గంగిరెద్దుల వారు. చక్కగా ఆలకరించిన గంగిరెద్దులను ఇంటింటికీ తిప్పుతూ డోలు,సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత చేయించే నృత్యాలు చూడటానికి చాలా రమణీయంగా ఉంటాయి. ఆ గంగిరెద్దులు మనము ఇచ్చే కానుకలను స్వీకరిస్సున్నట్లుగా తలలు ఊపుతూ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మోకాళ్ళ మీద వంగటం వంటి విద్యలు వాటికి నేర్పిస్తారు. అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుల వాళ్ళు సందడి చేస్తారు. కొత్త ధాన్యము వచ్చిన సంతోషంతో మనము వారికి ధాన్యము ఇస్తాము. హరిలో రంగ హరీ అంటూ నడినెత్తిపై నుంచి నాసిక దాకా తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘుల్లుఘల్లుమనగా చిందులు తొక్కుతూ చేతుల్లో చిరుతలు కొడుతూ కోడిగుడ్డులాంటి బోడి తలపై రాగి అక్షయ పాత్ర కదలకుండా హరిదాసు ప్రత్యక్షమవుతాడు.

## కనుమ



మూడవ రోజయిన కనుమ వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడువాదోడు ఉన్న పశువులకు శుభాకాంక్షలు తెలపడానికి జరుపుకుంటారు. ఉన్న పశువులకు శుభాకాంక్షలు తెలపడానికి జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు కూడా నిర్వహిస్తారు. అయితే ఆ పందాలను జీవహింసగా భావించి రాష్ట్ర ప్రభుత్వం నిషేదించింది. అంతేకాదు కనుమ నాడు మినుము తినాలనేది సామెత, దీనికి అనుగుణంగా ఆ రోజు గారెలు, ఆవడలు, చేసుకోవడం ఆనవాయితీ. కనుమ మరునాటికి ముక్కనుమ అని అంటారు. దీనికి బొమ్మల పండుగ అని పేరు. దక్షిణ భారతదేశంలోని ప్రజలు ఈ పండుగ మూడు రోజులను శ్రద్ధాసక్తులతో జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో మాత్రం ఈ పండుగలోని రెండవ రోజయిన మకర్ సంక్రాంతి లేదా లోరాని మాత్రమే జరుపుకుంటారు. కనుమ రోజున మాంసాహార తినడం ఆంధ్ర దేశాన ఆనవాయుతీగా వస్తుంది. మాంసాహారులు కాని వారు, గారెలతో సంతృప్తి పడతారు. అలాగే కనుమ రోజున ప్రయాణాలు చేయకపోవడం కూడా సాంప్రదాయం.

## తిల తర్పణం

సంవత్సరంలో మిగిలిన రోజులలో నల్ల నువ్వులు వాడరు. సంక్రాంతి పర్వ దినానా మాత్రం నల్ల నువ్వులతో మరణించిన పితృ దేవతలందరికీ తర్పణములివ్వడం ఎక్కువగా చేస్తుంటారు. దీన్నే పెద్దలకు పెట్టుకోవడం అంటుంటారు. సంక్రాంతి పర్వ దినాలలో వారి వారి ఆచార సంప్రదాయానలను అనుసరించి ఈ కార్యక్రమము చేస్తుంటారు. ఈ రోజు బూడిద గుమ్మడి కారు దానము ఇస్తారు.

**సంకురమయ/ సంక్రాంతి పురుషుడు**

మట్టిలో ఒక బొమ్మను (సంక్రాంతి పురుషుడు), తన వాహనాన్ని (ప్రతి సంవత్సరం వేరే వేరు వాహనాలపై పురుషుడువస్తాడు. ఏ వాహనాన్ని ఎక్కితే ఆ వాహనానికి ఆ సంవత్సరం ఎక్కువ నష్టం అని ఒక నమ్మకం) మేళ తాళాలు చేసి సంక్రాంతి మూడు రోజుల్లో పూజలు చేస్తారు. నాల్గవనాటు ఈ బొమ్మలను వాల్లాడిస్తారు.




## సంక్రాంతి ముగ్గులు

ఆడవాళ్ళ కళా నైపుణ్యమంతా పుణికి పుచ్చుకున్నవి సంక్రాంతి ముగ్గులు. సంక్రాంతి రథం అని, తాబేలు అని, పద్మం అని ఇలా రకరకాల సంక్రాంతి ముగ్గులు, రంగు రంగుల రంగవల్లికలతో పెట్టి కళా నైపుణ్యమంతా తెలుగు గడ్డమీద ఒలకబోస్తారు మహిళామణులు. అంతేకాదు ఈ ముగ్గులపై గొబ్బిళ్ళు పెట్టి తులసికోట వద్ద ప్రమిదలతో ముగ్గుల మీద దీపాలు వెలిగించి సంజవేళ, సంజ కాంతులలో దీప లక్ష్మీలా వెలిగిపోతుంది. రాళ్ళూ రప్పలూ లేకుండా ఒక పద్ధతిలో అలకబడిన నేల, మేఘాలు లేని ఆకాశానికి సంకేతం. ఒక పద్ధతిలో పెట్టబడు చుక్కలు రాత్రివేళ కనిపించే నక్షత్రాలకు సంకేతం. ఎంత పెద్దదైనా చిన్నదైనా ముగ్గు మధ్య గడిలో పెట్టే చుక్క సూర్యస్థానానికి సంకేతం. ఇంకొక దృక్పదంలో గీతలు స్థితి శక్తికి చుక్కలు గతి శక్తికి సంకేతాలని, ముగ్గులు శ్రీ చక్ర ప్రతీకలని శక్తి తత్త్వ వేత్తలు అంటారు. ఇక వివిధ ఆకారాలతో వేసే ముగ్గులు విల్లు ఆకారం పునర్వసు నక్షత్రానికి,పుష్పం పుష్యమీ నక్షత్రానికి పాము ఆకారం ఆశ్లేష నక్షత్రానికి మేక, ఎద్దు, పీత, సింహం, ఇలాంటివి మేష, వృషభ, మిధున, కర్కాటక రాసులకు తొమ్మిది గడుల ముగ్గు నవగ్రహాలకు సంకేతాలుగా చెప్పవచ్చు.

















## గొబ్బెమ్మలు

పెద్ద వయసు స్త్రీలు ముగ్గులు పెడుతుంటే చిన్న వయసు ఆడపిల్లలు ఆవు పేడతో చేసి పెట్టే గొబ్బెమ్మలు కృష్ణుని భక్తురాళ్ళైన గోపికలకు సంకేతం. ఈ ముద్దల తలమీద కనిపించే రంగుల పూలరేకులు, పసుపు కుంకుమలు ఆ గోపికలందరూ భర్తలు జీవించియున్న స్త్రీలకు సంకేతం. ఆ గోపికా స్త్రీల రూపాలకు సంకేతమే గోపీ బొమ్మలు గొబ్బెమ్మలు మధ్య ఉండే పెద్ద గొబ్బెమ్మ గోదాదేవికి సంకేతం. సంక్రాంతి రోజులో వీటి చుట్టు తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యం చేసి బాలికలంతా కృష్ణ భక్తి తమకు కలగాలని ప్రార్ధిస్తుంటారు. దీనిని సందెగొబ్బెమ్మ అంటారు. గొబ్బెమ్మలు పొద్దున పూట ముగ్గులో ఉంచి, దానిపై గుమ్మడి పూలుతో అలంకారం చేస్తే చాలా అందంగా ఉంటుంది. అసలీ గొబ్బిళ్ళంటే ఏమిటి? ఇది భూ దేవికి పూజ అన్న మాట. భూ గోళానికి ప్రతీకగా ఆవు పేడతో చేసిన గొబ్బిళ్ళనలంకరించి పంటలతో పూలతో సస్య లక్ష్మీలావున్న రుతువును సూచించేందుకు గుమ్మడి పూవును, బీర పూవునూ ఇలా ఏదో ఒక్క పండు వుండే కాయచెట్టు పూలకే అలంకరించడం గమనించదగ్గ విశేషం. గుమ్మడికాయ బ్రహాండానికి ప్రతీకగా ఈ సంక్రాంతి రోజున బలి చక్రవర్తి కూష్మాండదానం ఇవ్వాలని శాస్త్రం తెలుపెతోంది. సర్వ బ్రహాండాన్ని విష్ణువుకు దానం ఇచ్చిన వాడే బలి చక్రవర్తి, విష్ణువును ద్వార పాలకునిగా పొందినాడు గనుక భూగోళానికి సూచనగా గుమ్మడి పువ్వును, గోళంగా చేసిన ఆవుపేడ పైన వుంచుతారు. ఆవ పేడ పంటలు పండే శ్రేష్ఠమైన ఎరువు.పంట, సంతానమూ, సంపద ఇవన్నీ లక్ష్మీగా భావించారు. మన ప్రాచీన రుషులు. అందుకని కడుపార అందరినీ కన్నతల్లిగా ఈ భూదేవి ని పూజించి ఆడి పాడి వేడుకుంటారు. సంపదనీయవే అంటూ ఈ నాటికి గొబ్బిళ్ళ ఆట ఆడుతూ, కట్టుకుని కాలి అందెలు ఘల్లుఘల్లుమనేలా గెంతుతూ "సుబ్బీ గొబ్బెమ్మా, సుబ్బీ గొబ్బెమ్మా, మొగలి పూవు వంటి మొగుడ్నీయవే చామంతి పూవు వంటి చెల్లెల్నీయవే సుబ్బీ గొబ్బెమ్మా!" అంటూ ఆనందంగా నృత్యం చేస్తూ పాట పడతారు.



### రథం ముగ్గు

ముగ్గు రోజులతో పూర్తవతూ అందరికీ ఆనందాన్ని పంచే పండుగను ఘనంగా సాగనంపేందుకు పట్టినదే రథం ముగ్గు. అందరూ ఒకరిని ఒకరు తోడంటూ కలసి సహజీవనం సాగించాలి అనే సంకేతాలతో ఒక రథం ముగ్గు తాడును మరొక ఇంటి వారి ముగ్గుతో కలుపుతూ పోతుంటారు.

### హరిదాసు :



గొబ్బిళ్ళతో ఇంటి ముందరి భాగాన్ని అలంకరించి హరిని కీర్తించే భక్తులకు సాక్షాత్ శ్రీకృష్ణుడే హరిదాసు రూపంలోవస్తాడని సంకేతం. ఆయన తల మీద మంచి గుమ్మడి కాయ ఆకారంలో గల పాత్ర గుండ్రముగా ఉండే భూమికి సంకేతం. దాన్ని తలమీద పెట్టుకుని ఉండటం శ్రీహరి అయిన తానే భూమిని ఉద్ధరిస్తున్నానని చెప్పు దానికి సంకేతం హరినామా కీర్తన చేస్తూ రావడం. ఇది సంక్రాంతి నాడు కనిపించే అందమైన దృశ్యం. నెత్తిన తళతళ బంగారంలా మెరిసే కలశం పెట్టుకుని అందులో పొంగి బియ్యం వేయుంచకుంటూ,చేతి చిడుతలూ, కాళ్ళ గజ్జలూ గల్లు గల్లుమని మ్రోగగా భక్తి పారవశ్యంతో 'హరి గోవిందా ' అంటూ తన్మయత్వంతో భక్తిని ప్రసారం చేసేవారు ఈ హరిదాసులు. హరిదాసుని భక్తికి తన్మయులైన గృహస్తులు ఆనందంగా, తలోదోశడూ మంచి బియ్యం ధర్మం చేసేవారు. ఇది బిచ్చం కాదు.

### గంగిరెద్దు :



ముందు వెనుకల చెరో ప్రమిదితో (శివ గణం) ఎత్తైన మూపరం శివలింగాకృతిని గుర్తు చేస్తూ శివునితో సహా తన సంక్రాంతి సంభరాలకు హాజరయ్యానని చెప్పే సంకేతం గంగిరెద్దు ఆవుల ఏదా ఎద్దు ఇంటి ముందు ముగ్గులో నిలిచిందంటే ఆ నేల ధర్మ బద్ధమైనదని అర్థం. "జుగోవ గోరూపధరామివోర్వం" దీని అర్థం. ఆ నేల ఆవుకి సంకేతం ఆ నేల నుండి వచ్చిని పంటకు సంకేతం. ముంగిట నిలిచిన వృషభం. మీరు చేసిన దానమంతా ధర్మ బద్ధమేనంటూ దానిని మేము ఆమోదిస్తున్నామని ఇంటింటికీ తిరుగుతుంటారు. హిందువులు పండుగలలో సంక్రాంతి మాత్రమే సౌర గమనాన్ని అనుసరించి వస్తుంది. సంక్రాంతి లక్ష్మీలా అందంతో తెలుగాడపడుచు. తెలుగుదనం ఉట్టి పడే పండుగ సంకురాతిరి పండుగ అని ఊరికే అనలేదు. గొబ్బి పాటలు, డ్యాన్సు,కోలాటం,కోడి పందేలూ, గొర్రెపొట్టేళ్ళ పందాలు, ఎద్దుల పరుగల పందేలూ ఒకటేమిటి, సస్యశ్యామలమైన దేశానికి అన్నపూర్ణ అయిన తెలుగు గడ్డ మీద ఈ పండుగ వేడుకలు వ్యవసాయాత్మికంగా పల్లెపట్టుకు అందం ఇనుమడింప చేస్తాయి. ఇలా తెలుగుదనాన్ని ప్రతిబింబించేవి. అసలీ సంకురాత్రి పండుగే వేడుకలతో నిండి కన్నులు కళకళలాడించే లక్ష్మీ శోభను తెలుగునాట ఏ ఇంట చూచినా సస్య లక్ష్మీతో, గృహ లక్ష్మీతో,ధాన్య లక్ష్మీతో కలిసి ధన లక్ష్మీ తాండవమాండించే తెలుగు పండుగ.

# యువతకు దిశానిర్దేశం చేసిన సైన్స్‌కాంగ్రెస్





**రాజధాని వార్తలు డెస్క్ :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 104వ భారతీయ సైన్స్ కాంగ్రెస్‌లో మన బలాలు,బలహీనతలు తెలుసుకునే అవకాశం కలిగింది. అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవడానికి వేదికగా నిలిచింది ఈ సైన్స్ కాంగ్రెస్. ఇస్రో శాస్త్రవేత్తలు, పరిశోధనారంగ విద్యార్థులు, సామాన్యులు సాధించిన విజయాలను పంచుకోవడానికి చక్కని అవకాశం కలిగింది. నోబెల్ గ్రహీతల నుంచి విషయాలను తెలుసుకోవడానికి బదులుగా వారితో సెల్ఫీలను దిగటానికి వెచ్చించడం వారిని ఇబ్బందిపెట్టింది. ఒకదశలో సబ్జెక్టులో మీకున్న అనుమానాలు నివృత్తి చేసుకోండిగాని, సెల్ఫీలుకాదని నోబెల్ గ్రహీత సర్జ్ హిరోకే స్వయంగా చెప్పినా వినిపించుకోకపోవడం ఆహూతులను ఆగ్రహం కలిగించింది. ముందునుంచి ఈ కార్యక్రమంలో క్రమశిక్షణగా మెలగడం ఎలాగో అధికారులు అక్కడ పాల్గొనేవారికి అవగాహన కలిగించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేదికాదు. అత్యద్భుతంగా అనిపించే ఎన్నో ఆవిష్కరణలు ఇక్కడ చోటు చేసుకున్నాయి. యువత సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో కాకుండా దేశాభివృద్ధికి అవకాశం కలిగించే పరిశోధనలపై దృష్టిపెట్టాలని, దివంగత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అజాద్ కలలను నెరవేర్చాలని రక్షణశాక సాంకేతిక సలహాదారు డాక్టర్. జి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. శాస్త్ర పరిశోధనలకు పాలక వర్గాలు ఎంత మాత్రం ప్రోత్సాహం ఇవ్వడం లేదని ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.రామ్‌గోపాల్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అద్భుత ఫలితాలను గుర్తించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పాలక పక్షాలు కార్పొరేట్లకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ... రాయితీలు, ప్రోత్సాహకాలు అన్నీ వాళ్లకే అప్పజెబుతున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి ధోరణి యువ భారతాన్ని నిర్వీర్యం చేస్తుందని హెచ్చరించారు.

### మరిన్ని ఆవిష్కరణలకు ముందుకు రావాలి

నేటి పిల్లలే రేపటి పౌరులని బాలల సైన్స్ కార్యక్రమంలో నోబెల్ గ్రహీతలు మాట్లాడారు. మరిన్ని ఆవిష్కరణలు చేపట్టి దేశాన్ని ప్రపంచదేశాల్లో అత్యుత్తమ దేశంగా నిలపాలన్నారు. దేశీయ వైద్యం ఆయుర్వేదం అద్భుతమైందని దానికి దుష్ప్రభావాలు కలిగించవని వ్యాధిని సమూలంగా అంతం చేస్తుందని వాటిలోని శాస్త్రీయతను వెలికితీసి ప్రపంచానికి అందించాలన్నారు. ఈ దశాబ్ధంలో అనూహ్యమైన విప్లవాన్ని తెచ్చిన సెల్‌ఫోన్లు, వాటి టవర్లు మూడేళ్లలో కనుమరుగై వాటి స్థానంలో చిన్నచిన్న యాంటీనాలతో శాటిలైట్ సమాచారం వస్తుందని ఇస్రో అసోసియేట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు పేర్కొన్నారు. చంద్రయాన్‌ను 1ని విజయవంతంగా ప్రయోగించాని ఆ స్ఫూర్తితో చంద్రయాన్ 2ను ఈ ఏడాది చివరినాటికి సిద్ధం చేస్తున్నామన్నారు. దీంతో చంద్రుడిమీద రసాయనాలు, ఖనిజాలు ఉన్నాయనేది తెలుసుకునే వీలుంటుందని తెలిపారు. సూర్యుడిని అధ్యయనానికి ఆదిత్యఎల్1ని ఉపగ్రహాన్ని 2020 నాటికి ప్రయోగిస్తామన్నారు. మన దేశం ఇప్పటివరకు వినియోగించుకుంటున్న అమెరికా నావిగేషన్‌కు ధీటుగా సొంతంగా నావిగేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

### రానున్న రోజుల్లో చౌకగా మందులు తయారీ

సూర్యరశ్మిని ఉపయోగించి ఆకు ఎలా ఆహారాన్ని తయారు చేసుకుంటుందో పరిశోధించిన శాస్త్రవేత్తలు ఔషధాల్ని చౌకగా ఎక్కడైనా అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటే పత్రాన్ని నెదర్లాండుకు చెందిన ఐంధోవెన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు రూపొందించారు. "ల్యూమినిసెంట్ సోలార్ కాన్‌సెంట్రేటర్స్" (ఎల్ఎస్‌సీ)లోని కాంత్రి గ్రాహక హ్యాకమాలిక్యుల్స్ భారీ స్థాయిలో సూర్యరశ్మిని గ్రహించి నిర్ధిష్ట అవసరాలకు మేర పనిచేస్తాయని తిమోతి నోయెల్ తెలిపారు. ఔషధాల తయారీకి అవసరమైన రసాయనిక ప్రతిచర్యకు విషరసాయనాలను వాడటం తగ్గించి ప్రకృతి సిద్ధమైన కాంతిని ఉపయోగించడం ద్వారా విష రసాయలను నిరోధించవచ్చన్నారు.



సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి మోదీతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

### అంతరిక్ష సాంకేతికతతో పరిశ్రమల అభివృద్ధి

అంతరిక్ష సాంకేతికతను పరిశ్రమలు సద్వినియోగం చేసుకుంటే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని విక్రమ్‌సారాభామ్ అంతరిక్ష కేంద్రం సంచాలకుడు డాక్టర్ కె.శివన్ పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంతరిక్ష పరిశోధనలపై శివన్ ప్రధాన ప్రసంగం చేశారు. అంతరిక్షసాంకేతిక సైనికులు, రక్షణ విభాగం కోసమే నన్న అపోహ ప్రజల్లో ఉంది. భూగర్భంలోంచి చమురు వెలికితీత వంటి ప్రయోగాలు సైతం ఇస్రో చేస్తోంది. తక్కువ ఖర్చుతో చమురు, సహజ వాయువు వెలికితీత ప్రయోగాలను విజయవంతంగా చేపట్టింది. మనం తీర ప్రాంత సంపద (బ్లూ ఎకానమీ) గురించి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోరిక్ష పరిశోధనలను దీనికి వర్తింజేసుకుంటే.. అద్భుత ఫలితాలు సాధించ వచ్చు చేపలు ఎక్కువగా ఎక్కడ లభ్యమవుతాయో గగనతలం నుంచే పసిగట్టే సాంకేతికతను ఇస్రో రూపొందించింది. తద్వారా జాలర్లు నేరుగా అక్కడికి వెళ్లి చేపలు పడితే ఖర్చు శ్రమ తగ్గుతుంది. ఇస్రో పరిశోధనలపై సరైన ప్రచారం లేదు. లబ్ధిపొందే పరిశ్రమలే ముందుకు వచ్చి తగిన సమాచారం తీసుకోవాల్సి ఉంది. ఇస్రో పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఢిల్లీ పోలీసులు నేర నియంత్రణకుచర్యలు చేపట్టారు. ఆ దిశగా హైదరాబాద్ పోలీసులూ ముందుకు వచ్చారని ఆయన విశదీకరించారు.

## అబ్బురపరిచే ఆవిష్కరణలు

### డిజిటల్ సమాజంలో.. ఉద్యోగాల్లో కోత

రోజుకో ఆధునికతతో అనూహ్యంగా మారుతున్న డిజిటల్ సమాజంలో.. ఉద్యోగాల్లో కోతపడుతుండటం ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆందోళనకు గురి చేస్తున్న అంశం. దీనిపై ఆందోళన పడుతూ సాంకేతికతను అడ్డుకోవడంమూర్ఖత్వమవుతుందని..ఏంచేయాలో ఆలోచించాలంటున్నారు. ఆర్థిశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత జీన్ తిరోల్ భారత జాతీయ సైన్స్ కాంగ్రెస్ సమ్మేళనంలో పేర్కొన్నారు. ఈ మార్పులు, డిజిటలైజేషన్ వల్ల లాభపడే వారితో పాటు నష్టపోయేవారు కూడా ఉంటారని, పరిష్కారాలను కనుగొనాల్సింది 21వ శతాబ్ది పూర్తిగా విజ్ఞానాధారిత సమాజమేనన్నారు . నిజానికి... ప్రపంచంలో అనేక ఆవిష్కరణల్ని బాగా చదువుకున్న వారు కాకుండా... సామాన్యులే చేశారని, అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల్లో కంటే బయటే ఆవిష్కరణలు జరిగాయన్నారు. 21వ శతాబ్దిలో వ్యాపారం మారుతుంది. డిజిటల్ సమాజంలో.. పారిశ్రామిక విధానాల్లో సమాన మార్పులు చేపడితే నాణ్యత విషయంలో దేశాల మధ్య సమన్వయం సాధించాలన్నారు. మారుతున్న సమాజంలోని సరికొత్త సవాళ్ళను ఎదుర్కొనే సమర్థమైన మావన వనరులు భారత్ వద్ద పుష్కలంగా ఉన్నాయని తిరోల్ అభిప్రాయపడ్డారు.జాతీయ సైన్స్ కాంగ్రెస్ మహాసభల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆరవ మహిళా సైన్స్ కాంగ్రెస్ నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు బాలల సైన్స్ కాంగ్రెస్ జరిగింది. శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాల్లో మహిళాల పాత్ర పెరగాలన్న ఉద్దేశంతో భారత శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్టీ) ప్రత్యేక చొరవ తీసుకుని దీనిని నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) డైరెక్టర్ డా.టెస్సీ థామస్ కీలకోపన్యాసం చేయగా, జాతీయభివృద్ధిలో శాస్త్రవేత్తల పాత్ర, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అన్నం అంశంపై లబ్ధప్రతిష్ఠులైన 11 మంది మహిళా శాస్త్రవేత్తలు ప్రసంగించారు. డా.శశిబాలాసింగ్, ప్రొ.హెచ్.ఎస్.సావిత్రి,డా.నీతా వర్మ, డా.సుధానాయర్ తదితరులు వీరిలో ఉన్నారు. మహిళా పరిశోధకులకు డీఎస్టీ అమలు చేస్తున్న కార్యక్రమాలు, అవకాశాల గురించి డా. వందనా సింగ్ వివరించారు.

### రాబోయే తరం కోసం

శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించడం, వారిలోని నైపుణ్యాలకు పదునుపెట్టడం, పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ఆసక్తి పెంచడం లక్ష్యంగా 10-17 సంవత్సరాల మధ్య ఉన్న వారి కోసం బాలల సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించారు. జపాన్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత ప్రొ.తకాకి కజితా కీలకోపన్యాసం చేశారు. భారత ప్రభుత్వ ముఖ్య శాస్త్ర సలహాదారు డా.ఆర్.చిదంబరం, ఇస్రో ఛైర్మన్ డా.ఎ.ఎస్.కిరణ్‌కుమార్ ప్రసంగాలు ఉంటాయి. మూడు రోజుల పాటు ప్లీనరీ సదస్సులు జరిగాయి.

### ప్రయోగాలే కీలకం

ఇంధనం,వ్యవసాయం,విద్య వంటి అతిముఖ్యమైన విభాగాల్లో అత్యాధునిక పరిశోధనలు జరగాలి. ప్రభుత్వం రంగ సంస్థలు ఈ దిశగా ప్రయోగాలు చేయడం వల్లే మంచి ఫలితాలు సాధ్యమయ్యాయి. భారత పారిశ్రామిక రంగం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. దీంతో మేధో సంపత్తిని అందిపుచ్చుకోవడం లేదు.ఇవన్నీ అనుసరిస్తేనే పారిశ్రామిక పురోగాభివృద్ధి సాధ్యమవుతుంది.

- కూర్పు : ఖాన్

## న్యూట్రినోలతో విశ్వరహస్యం తెలుసుకోవచ్చు

### నోబెల్ శాస్త్ర వేత్త తకాకీ కజిత

భౌతిక శాస్త్రంలో దశాబ్దాలుగా కొరుకుడు పడని న్యూట్రినోల గుట్టువిప్పి, అంతరిక్ష పరిశోధనలకు దిశానిర్దేశం చేసిన జపాన్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ తకాకీ కజిత. అత్యంత ప్రాథమికమైన న్యూట్రినో రేణువులకు ఎలాంటి ద్రవ్యరాశిలేదని కుంద బద్దలుగొట్టిన భౌతికశాస్త్ర 'ప్రామాణిక నమూనా' (స్టాండర్డ్ మోడల్)న తప్పని సశాస్త్రీయంగా నిరూపించారు. న్యూట్రినోకూ ద్రవ్యరాశి ఉంటుందని రుజువు చేసి 2015 సంవత్సరానికి భౌతికశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు. తిరుపతిలో సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన నిత్యజీవితంలో జీవితంలో దీని ఉపయోగాలు లేవని, విశ్వం గురించి మన అవగాహనను పెంచడానికి దోహదపడుతుందని వెల్లడించారు.

## రక్షణ రంగంలో భారత్ భేష్

### జి.సతీష్‌రెడ్డి

అంతరిక్ష పరిశోధనలో దేశం ఎంతో ముందుందని వరుసగా 36 పీఎస్ఎల్వీ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించిందని రక్షణ మంత్రి సలహాదారు జి.సతీష్ రెడ్డి అన్నారు. 'చంద్రయాన్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షించాం. స్వదేశీ పరిజ్ఞానంతో ఇతర రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని నమోదు చేసినా రక్షణ ఉత్పత్తుల విషయంలో దేశం ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందని, రక్షణ ఉత్పత్తులను ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ఈ పరిస్థితి నుంచి పూర్తిగా బయటపడి ఎగుమతి చేసుకునే స్థాయికి ఎదగాలని ప్రధాని కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.ఈ రంగంలో మన బలాలను గుర్తించటంతో పాటు బలహీనతలు అధిగమిస్తామని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో అనేక సృజనాత్మక ఆవిష్కరణలు ప్రోత్సహిస్తే స్వదేశీ పరాజ్ఞానంతో ఉత్పత్తులు అభివృద్ధి చేయటం కష్టసాధ్యమేమీ కాదని అన్నారు.నూతన పరిశోధకులకు ప్రోత్సహించటమే లక్ష్యంగా ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలన్న ఆలోచనలు ఉన్నాయన్నారు. ప్రముఖ శాస్త్ర వేత్తలు డాక్టర్ చిదంబరం, సారస్వత్, అశుతోష్ శర్మ, డాక్టర్ పి.రాజీవన్ ఈ సదస్సులో మాట్లాడారు.

## పరిశోధనలకు ప్రోత్సాహమేదీ ?

- వందకే హృద్రోగ పరీక్ష, భద్రతకు ఐఐటీ విద్యార్థుల ఘనత
- మరి పరిశోధనలకు నిధులివ్వరెందుకు?
- ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ రామ్‌గోపాల్‌రావు

శాస్త్ర పరిశోధనలకు పాలక వర్గాలు ఎంత మాత్రం ప్రోత్సాహం ఇవ్వడం లేదని ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.రామ్‌గోపాల్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అద్భుత ఫలితాలను గుర్తించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలక పక్షాలు కార్పొరేట్లకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ... రాయితీలు, ప్రోత్సాహకాలు అన్నీ వాళ్లకే అప్పజెబుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితే ఉంటే పారిశ్రామిక రంగానికి అంతర్జాతీయ ప్రామాణికత ఎలా వస్తుందని ప్రశ్నించారు. సరికొత్త ప్రయోగాలన్నీ యూనివర్సిటీ లేబొరేటరీలకే పరిమితమవ్వడం జాతి మొత్తం ఆలోచించాల్సిన అంశమన్నారు. ఇలాంటి ధోరణి యువ భారతాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. తిరుపతిలో జరుగుతున్న 104 వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా బుధవారం 'పారిశ్రామిక ఆర్థిక పురోభివృద్ధి ' కార్యక్రమానికి రామ్‌గోపాల్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లో ఈ అంశాలు

### ఐఐటీ విద్యార్థుల ఆవిష్కరణలకు గుర్తింపేదీ?

మన ఐఐటీ విద్యార్థులకేం తక్కువ. ఇప్పుడున్న పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి పోసే శక్తి వాళ్లకు ఉంది. వాళ్ల ప్రయోగాలు... వాటి ఫలితాలు అద్భుతంగా ఉంటున్నాయి. కానీ ఏం లాభం? అవన్నీ యూనివర్సిటీ మెట్లు దాటడం లేదు. ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. పైగా ఇంజనీరింగ్ విద్యపై నిందలేస్తారు. నానో టెక్నాలజీని ఉపయోగించి కేవలం వంద రూపాయల్లోనే హృద్రోగ వ్యాది నిర్ధారణ పరీక్ష చేసే విధానాన్ని పూణె ఐఐటీ విద్యార్థులు ఆవిష్కరణ చేశారు. దీన్ని అనేక విధాలుగా పరీక్షించాం. ఇప్పుడన్న లేబోరేటరీల కన్నా అద్భుతమైన ఫలితాలు ఇస్తోంది. దీన్ని వైద్య రంగంలోకి తీసుకెళ్లడానికి పెద్ద మొత్తంలో నిధులు కావాలి. ఈ ప్రయోగాన్ని మార్కెట్లోకి తీసుకెళ్తే వేల కోట్ల వ్యాపారం చేయడానికి వీలుంది. ఆ అవకాశం యువ శాస్త్రవేత్తలు ఎందుకు కల్పించరు? పేలుడు పదార్థాల గుర్తింపుకు ఇప్పుడు ఎక్కడా లేని ఉపకరణాలను ఐఐటీ విద్యార్థులు కనిపెట్టారు. నానో టెక్నాలజీలో ఇదో అద్భుతమే. కానీ ఫలితం ఏమిటి? దాన్ని మార్కెట్ చేయాలంటే నిధులు కావాలి. ఎక్కడి నుంచి వస్తాయి.?

### యువ శాస్త్రవేత్తలను గౌరవించాలి

కోట్లు వెచ్చించి పరిశ్రమలు పెట్టడం.. దానికి వేల కోట్లు రాయితీలు ఇవ్వడం పారిశ్రామిక పురోభివృద్ధికి మార్గం కానే కాదు. ప్రజల అవసరాలు, అతి తక్కువకే అద్భుతమైన సేవలు అందాలి. ఇది యువ శాస్త్రవేత్తల వల్లే సాధ్యం. కానీ ఇవేవీ లేకుండానే, ముఖ్యంగా పరిశోధనపై దృష్టి పెట్టకుండానే పరిశ్రమలు పెడుతున్నారు. నష్టాలకు సవాలక్ష కారణాలు వెదుకుతున్నారు. పైగా ఉన్నత విద్యపై నిందలేస్తున్నారు. ఇంకా మెరుగుపడాలని చెబుతున్నారు. అలాకాకుండా దేశానికి అవసరమైన యువ శాస్త్రవేత్తల అభిప్రాయాలను గౌరవించాలి. అప్పుడే ఇలాంటి సైన్స్ కాంగ్రెస్‌ల వల్ల ప్రయోజనం ఉంటుంది. ఆ దిశగా మేధోమధనం జరగాలని కోరుకుంటున్నాను.

# భూగర్భ డ్రైనేజి నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూపులు...

(మొదటిపేజీ తరువాయి)

సర్పంచ్ గంజిమాలదేవికి చెప్పినట్లు జడ్.పి. ఉపాధ్యక్షురాలు వెంకటరమణ రాజధాని ప్రతినిధితో మాట్లాడుతూ చెప్పారు. పంచాయతీ నిధులు జమ చేసే విషయమై పంచాయతీ బోర్డు సభ్యులతో చర్చించవలసి ఉందని సర్పంచ్ చెప్పారని ఆమె చెప్పారు. పంచాయతీ తమ వంతు కనీసం 10 శాతం నిధులనైనా ఇవ్వకపోతే జడ్.పి. నిధులు భూగర్భ డ్రైనేజి నిర్మాణానికి వచ్చే పరిస్థితి లేదని వైస్‌చైర్మన్ వెంకటరమణ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఈ నెల 9న జరిగిన కొయ్యలగూడెం జన్మభూమి సభలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పారేపల్లి శ్రీనివాస్ కూడ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఈ విషయమై రాజధాని వార్తలు ప్రతినిధి పరింపూడి పంచాయతీ సర్పంచ్ దేవి మంగళవారం ఫోన్ ద్వారా ప్రస్తావించగా పంచాయతీ బోర్డు సమావేశంలో ఈ అంశంపై వార్డు సభ్యులతో చర్చించవలసి ఉందని ఆమె చెప్పారు.తాను గ్రామాంతరం వెళుతున్నానని సంక్రాంతి అనంతరం బోర్డు సభ్యులతో చర్చించటం జరుగుతుందని, సర్పంచ్ పేర్కొన్నారు. పట్టణంలో వీధి రోడ్లను సి.సి. రోడ్లుగా అభివృద్ధి పరచటానికి ఒక వైపు ఎమ్మెల్యే శ్రీనివాసరావు,ఎం.పి. మాగంటి బాబు,ఎం.పి.పి. చందనశ్రీదేవి, జడ్.పి. వైస్ చైర్మన్ వెంకటరమణలతో పాటు గ్రామ పంచాయతీ కూడ ఇబ్బడిముబ్బడిగా లక్షలాది రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నారు.దాదాపు పట్టణంలో 75 శాతం వీధులలో డ్రైయిన్‌జి వ్యవస్థలేక, డ్రైయిన్‌లు నిర్మాణం జరగక ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ పరిస్థితికి అడ్డుకట్టి వేయాలంటే భూగర్భ డ్రైయినేజిని నిర్మించటమే శరణ్యమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా పరిషత్ నిధులకు పంచాయతీ నిధులు కూడ కలిపి భూగర్భ డ్రైయినేజి నిర్మించటానికి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఐక్యమత్యంగా పని చేసి ప్రజలకు, పట్టణానికి మేలు జరగాలని అందరు ఎదురుచూస్తున్నారు.

## అంకెల గారడీ తప్ప ఏమీలేదు : కోటేశ్వరరావు

**రాయపూడి :** జన్మభూమికార్యక్రమాల్లో అంకెల గారడీతప్ప ఇంకేమీలేదని సీపీఎం విమర్శించింది.ఈ నేపథ్యంలో సీపీఐ నిర్వహించిన సమావేశానికి వ్యవసాయ కార్మిక కార్యదర్శి చింతరాల కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ఏరియా కార్యదర్శులు కాబోతు ఈశ్వరరావు, జియూ రాజులు పాల్గొన్నారు. నివాసస్థలం లేని నిరుపేదలకు పక్కాగృహాలు నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్నవారి సంఖ్యను శాసనసభ్యులు, అధికారులు వెల్లడించారు కాని, సీఆర్‌డీఏ అధికారులు మాత్రం ఎటువంటి దరఖాస్తులు అందుకోలేదని చెప్పడం దారుణమని కోటేశ్వరరావు తెలిపారు. వ్యవసాయపనులు కోల్పోయిన వ్యవసాయకార్మికులు, శ్రామిక మహిళల ఉపాధికి సంబంధించి కార్యాలయాల్లో దరఖాస్తులు అందలేవని చెబుతూ గ్రామసభల్లో ఉపాధికల్పిస్తున్నామని చెప్పడం ప్రజలను ఆయోమయానికి గురిచేయడమే అన్నారు.ఈ ప్రాంతంలో రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ ఉపాధి శిక్షణా కోర్సులు కళాశాలను సత్వరమే నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ కోఆపరేటివ్ ఫార్మింగ్, లెనిన్‌కోఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ, హరిజన కోఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ పరిధుల్లో సాగుచేసుకుంటున్న రైతులకు నష్టపరిహారం ప్రకటించాలని వారు డిమాండు చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీ.పీ.ఐ రాయపూడి శాఖ కార్యదర్శి కంభంపాటి దేవుని దయ, కంభం పాటి దిబ్బయ్య, కె.బాలస్వామి, పి.ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

### బి.జె.పి.మహిళా మోర్చ జాతీయపార్టీ ఇన్‌చార్జ్ దగ్గుబాటి పురంధేశ్వరి

**అన్నంరెడ్డి.సుబ్బారావు,రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం. :** మరుగునపడిపోతున్న తెలుగు ప్రజల సంస్కృతి సాంప్రదాయాలకు సంక్రాంతి సంబరాలు ప్రతీకగా నిలుస్తున్నాయని, అలాంటి సాంప్రదాయ కళారీతులను తమ విద్యాసంస్థల బాలబాలికలు, విద్యార్థినీ విద్యార్థులు చేత ప్రదర్శనలు నిర్వహించటం ఎంతో అభినందనీయమని బి.జె.పి. మహిళా మోర్చ జాతీయ విభాగం ఇన్‌ఛార్జి, కేంద్ర మానవవనరుల శాఖ మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరీ ఆనందం వ్యక్తం చేశారు. గవరవరంలోని శ్రీ వెంకటపతిరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆ విద్యా సంస్థ బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సవంలో పురంధేశ్వరీ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. విద్యాసంస్థల బాలబాలికలు ప్రదర్శించిన నృత్యాలను, బొమ్మల కొలువును పొదరిల్లును, గంగిరెద్దులను, హరిదాసులను బాలికలు వేసిన సంక్రాంతి ముగ్గలను పురంధేశ్వరీ, రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు, కేంద్ర ఎగుమతులు గ్యారంటీ కార్పోరేషన్ డైరెక్టర్ అయిన శరణల మాలతీరాణి, ఆసక్తిగా తిలకించారు. బాలబాలికలు ప్రదర్శించిన గోదాదేవి కళ్యాణం నృత్య రూపకాన్ని తిలకించి ఆస్వాదించారు. బాలబాలికలు భోగి పళ్లను శిరస్సులపై పోసి ఆశీర్వదించారు. భోగిమంట వెలిగించి ప్రదక్షిణ చేసారు. గొబ్బిళ్లతో ఆడారు. పొయ్యి వెలిగించి పరమాన్నం వండటానికి బియ్యం తదితరులు పొయ్యి మీద పెట్టారు. ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం బస్తాలు వరిగడ్డిని, ఎడ్ల బండికి తిలకించారు. పురంధేశ్వరి, మాలతీరాణి ఎడ్లబండి ఎక్కి పగ్గాలు చేతబట్టి బండిమీద నిలిచారు. డి....... విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందచేసి, క్రీడా పోటీలలో విజేతలను అభినందించి వారితో ఫోటోలు దిగారు. బాలబాలికలు మేథావులుగా తయారు కావటానికి తరగతి గదులే పునాదులని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉత్తమపౌరులుగా, మేధావులుగా తీర్చి దిద్దటానికి శ్రద్ధచూపాలని పురంధేశ్వరి తన ప్రసంగంలో పేర్కొన్నారు. మంచి వాతావరణంలో సంక్రాంతి పండుగ ముందు రోజున సంక్రాంతి సంబరాల నిర్వహించి తెలుగు వారి సాంస్కృతిక సాంప్రదాయాలను కళ్లెదుట చూపిన వెంకటపతి రాజు విద్యా సంస్థల యాజమాన్యం నరసింహరాజు, సుభద్రాదేవిలను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని, తనను ఈ ఉత్సవంలకు ఆహ్వానించి భాగస్వామిని చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానని పురంధేశ్వరి అన్నారు. భోగిపళ్లు బాలలకు పోసి వేదిక దిగి వస్తున్న పురంధేశ్వరి రాష్ట్ర మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి బొల్లిన నిర్మలా కిశోర్ చేతులతో ఉన్న చిన్నారి పాప దేవి ప్రసాయిలక్ష్మిని తన చేతులలోకి తీసుకొని, ఎత్తుకొని లాలించారు. పాప పేరును అడిగి తెలుసుకొని ఆశీర్వదించారు. అనంతరం వెంకటపతిరాజు, సుభద్రాదేవి దంపతులు పురందేశ్వరిని సత్కరించి జ్ఞాపికను ఇచ్చి తమ విద్యా సంస్థకు వచ్చి తమ విద్యార్థులను ఆశీర్వదించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మాలతీరాణి, బొల్లిన నిర్మలా కిశోర్, ఎ.పి. మహిళా సహకార ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘాలాదేవి, తహాశీల్దార్ ఆకుల కృష్ణజ్యోతి, ఎం.పి.డి.ఓ.ఎం. రాజు, డి.వి. ఇ.ఓ.ఎం. తిరుమలదాసు, ఎస్.డి. పవన్‌కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.



సంబరాల్లో ఎడ్లబండి ఎక్కి పగ్గాలు చేత బట్టిన పురంధరేశ్వరి

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**రాజధానిప్రతినిధి,కోనసీమ-జివిన్.రావ్ :** స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని అమలాపురం స్థానిక ఎర్రవంతెన వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్పతోపాటు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో పూలమాలలువేశారు. ఈ సందర్భంగా వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ వివేకానందుని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి చంద్రమౌళి, మోకా వెంకటసుబ్బారావు, బసవా శివరామ్‌ప్రసాద్, ఆర్‌వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర కాపునాడు, కాపుయువసేన ఉభయగోదావరి జిల్లాల ఇన్‌ఛార్జ్ నిమ్మకాయల సురేష్ ఆధ్వర్యంలో స్వామివివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కాపునేతలు మురమళ్ళ వీరశివారెడ్డినాయుడు, చిక్కాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.




## 5వ విడత జన్మభూమి నాటికి వీధులన్నీ సి.సి.రోడ్లుగా అభివృద్ధి



నరసన్నపాలెం జన్మభూమి సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

**అన్నంరెడ్డి.సుబ్బారావు,రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం. :** రానున్న 5 వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం, గ్రామ సభల నాటికి నియోజక వర్గంలోని అన్ని గ్రామాలలోని వీధులన్నింటిని సిమెంటు రోడ్లగా అభివృద్ధి చేస్తామని గ్రామాలలో అందుబాటులో ఉన్న నిధులతో సి.సి. డ్రెయిన్‌ల నిర్మాణం కూడ చేపట్టటం జరుగుతుందని పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు ప్రకటించారు. నరసన్నపాలెం, దిప్పకాయలపాడు గ్రామాలలో మంగళవారం జరిగిన 4 వ విడత జన్మభూమి- మా ఊరు గ్రామ సభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నరసన్న పాలెంలో సభకు స్థానిక సర్పంచ్ మిరియాల వెంకటేశ్వరరావు, దిప్పకాయలపాడు సభకు సర్పంచ్ గొడ్డాటి రాణి అధ్యక్షత వహించారు. సంక్రాంతి శెలవుల అసంతరం నరసన్న పాలెం వై.జంక్షన్ వద్ద గ్రామానికి చెందిన పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు సమస్యపై అధికారులు, రైతులతో చర్చించి నిర్ణయం తీసుకోవటం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.సరిపల్లి పంచాయతీ నుంచి మర్రిగూడెం,బిల్లుమిల్లిమీదుగా కన్నాపురం వరకు గల గ్రావెల్ రోడ్డును ఎస్.టి.సబ్‌ప్లాన్ నిధులు రూ.1.80 కోట్లలతో తారు రోడ్డుగా అభివృద్ధి పరచే పనులు వారం రోజులలో ప్రారంభం అవుతాయని దిప్పకాయలపాడును సభలో ఎమ్మెల్యే వెల్లడించారు.

# చిరు ఈజ్ బ్యాక్



సినీ అభిమానులు మూడురకాలుగా ఉంటారు. అభిమానులు , దురభిమానులు, నిజాయితీగా విశ్లేషణ జరిపేవారు. ఖైదీనెం.150 సినిమాకు పాజిటివ్ రివ్యూలు వచ్చాయి. సినిమా బాగుందని అనే అన్నారంతా. అందులో సందేహం లేదు. ఈ నేపథ్యంలో నిజాయితీగా లోటుపాట్లు గురించి చెప్పేవారు విశయం ఏమంటే ఆయన కోసమే వచ్చే జనం ఇక సినిమాలో ప్లస్ లు మైనస్ లు పట్టించుకోరు. వాళ్లు పదేళ్ల తరవాత మెగాస్టార్ ను చూడడానికి వచ్చారు. చూసారు. ఆయన వారి అంచనాలకు తగినట్లు కనిపించారు. దట్సాల్. అది చాలు సినిమా ఆడేయడానికి.

నిజానికి ప్రజలకు ఏదో చేయాలి. ప్రభుత్వాన్ని నిలదీయాలి అనుకుంటే కేవలం గ్రామాన్ని మాత్రమే సబ్జెక్టుగా తీసుకోకూడదు. అదే ఓ రాష్ట్ర సమస్యను తీసుకొని, రైతుల సమస్యలను పంచ్ డైలాగ్ లతో చేసి వుంటే చిరంజీవి మైలేజ్ అదిరిపోయేది.

కమర్షియల్ సినిమాలో లాజిక్ లు చూడకూడదు కానీ, క్లయిమాక్స్ సీన్ లో నాగబాబు ఓ న్యాయమూర్తిగా కోర్టు వరండాలో నిల్చుని టక్కున జడ్జిమెంట్ చెప్పడాన్ని ఆడియన్స్ అర్థం చేసుకుంటానికి కష్టంగా అనిపిస్తుంది. ఇద్దరు చిరంజీవులకు క్లియర్ మార్పు కనిపిస్తున్నపుడు, ఇక్కడి వారు అక్కడ అక్కడి వారు ఇక్కడ చటుక్కున మారిపోవడం ఏమిటి? పల్లెటూరి వదిలి మగవారంతా వచ్చారని ఓసారి అంటారు. పిల్లలు పట్టించుకోకపోతే పట్నం వచ్చి వుంటున్నారని మరో డైలాగ్ లో చెబుతారు. దీంతో గందరగోళం ఏర్పడింది.

సినిమాకు అనవసరంగా ఎక్కువ ఖర్చుపెట్టి , అవసరమైనచోట్ల పీనాసిగా తీశారనిపిస్తోంది. పైగా వృద్ధ రైతులుగా జూనియర్ ఆర్టిస్టులు, దీంతో రెండోభాగం దెబ్బతింది. అయితే చిరంజీవి చాలా అందంగా వున్నారు, అదే సినిమాకు పెద్ద ప్లస్. పాటల కన్నా, ఫైట్లు బాగున్నాయి. ఆ ఏజ్ లో ఆయన ఆ మాత్రం డ్యాన్సలు చేయడం కూడా మెచ్చుకోవాలి. బన్నీ, చరణ్‌లాంటి వాళు డ్యాన్సులు వేస్తుంటే అంతే వేగం సీనియర్ యాక్టర్ అందుకోవడం అంత ఈజీ కాదు. ఫైట్ మాస్టర్లు బాగా మేనేజ్ చేసారు. అయితే అన్ని చోట్లా ఒకే ఫిజిక్ తో కనిపించలేదు. రెండు పాటల్లో మాత్రం చిరంజీవి అందగా మెరిశారు. మిగతా చోట్ల మళ్లీ లావుగా కనిపించారు. ఇద్దరు హీరోల పాత్రల్లో శంకరం పాత్రకు ప్రాధాన్యత ఇచ్చి వుండాల్సింది. మరీ పప్పు శుద్దలా చూపించారు. పొలిటికల్ డైలాగులు కొంచెం ఎక్కువుంటే పసందుగా ఉండేది. ఏది ఏమైనా కత్తి ఒరిజినల్ చూసిన వారికి దీన్ని చూస్తే , కానీ ఎక్కడో కనెక్టివిటీ దెబ్బతిందనిపిస్తుంది.

## తెలుగువారి పౌరుషాగ్నిగా గౌతమీపుత్ర శాతకర్ణి



తక్కువ సినిమాలకు దర్శకత్వం వహించినప్పటికీ సినీపరిశ్రమలో తనకంటూ ఒక శైలిని, బాణీని ఏర్పరచుకున్నాడు క్రిష్ . చారిత్రక కథాంశాన్ని తీసుకొని బాలకృష్ణ 100వ చిత్రంగా తెరకెక్కిన 'గౌతమిపుత్ర శాతకర్ణితో ఎక్కువమందికి తెలియని 'శాతకర్ణి వీరగాధని చెప్పడం, రెండు అంచనాలకి తగ్గ విధంగా సినిమాని తీర్చిదిద్దడం. శాతకర్ణి గురించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు వెళ్లినట్టయితే ఈ చిత్రంలో మనకి లభించేది అరకొర ఇన్‌ఫర్మేషనే. బాలయ్య వందవ చిత్రాన్ని ఆస్వాదించడానికి వెళితే మాత్రం పెట్టిన రూపాయలకు వినోదం దొరుకుతుంది. గౌతమీ పుత్ర శాతకర్ణి పరిపాలనా దక్షతా, వ్యవహార శైలి, ఆలోచనా విధానాలు సంస్కరణల విషయంలో దర్శకుడు ఫెయిలైనా తనకి దొరికిన కొద్దిపాటి ఇన్‌ఫర్మేషన్‌తోనే ఒక కమర్షియల్ సినిమాకి అనువైన అంశాలని జోడించి వినోదాన్ని అందించాడు. కేవలం రెండుంపావు గంటల నిడివి ఉన్న సినిమాని యుద్ధ సన్నివేశాలతో నింపేసారు. మొదటిది పరిచయం చేయడానికి రెండవది సాగుతూ దాదాపు ముప్పావు వంతుభాగాన్ని మొదటి భాగం సినిమాను తినేసింది. ద్వితీయార్ధంలో భార్యాభర్తల నడుమ అభిప్రాయబేధాలతో కాసేపు ఫ్యామిలీ డ్రామా నడుస్తుంది. అదే సమయంలో తల్లి పట్ల, స్త్రీల పట్ల శాతకర్ణికి వున్న అపార గౌరవాభిమానాల గురించిన వివరాలు తెలుస్తాయి. భరత ఖండాన్ని ఏకఛత్రాధిపత్యం కిందకి తీసుకురావాలని, యుద్ధాలు లేకుండా చేయడానికి యుద్ధం చేయడమే మార్గమని నమ్మిన శాతకర్ణి తన లక్ష్యానికి ముగింపుగా ఒక శాంతియుద్ధం చేయ సంకల్పిస్తాడు. అలెగ్జాండర్ వల్ల కాని భరతఖండాన్ని జయించాలని వచ్చిన గ్రీకు చక్రవర్తి డిమిత్రియస్‌తో ఈ యుద్ధం చేస్తాడు. ఈ చిత్రం ద్వితియార్థంలో సింహభాగం ఈ యుద్ధ సన్నివేశాలే ఉంటాయి. నహపనుడితో జరిగే యుద్ధంలో అయినా ఆసక్తి రేకెత్తించే వ్యూహ ప్రతివ్యూహాలుంటాయి కానీ అంతిమ యుద్ధం మాత్రం చప్పగా సాగిపోతుంది.ే క్రిష్ ఈ చిత్రాన్ని ఫక్తు బాలక ృష్ణ మార్కు మాస్ సినిమాలానే తీర్చిదిద్దడం ఆశ్చర్యపరుస్తుంది. అడుగడుగునా హీరోయిజమ్ ఎలివేట్ చేసే సన్నివేశాలు, అనర్గళంగా వచ్చి పడే పంచ్ డైలాగులు, తొడకొట్టడాలు, మీసం తిప్పడాలు ఏదీ మిస్ కాలేదిందులో తన అద్భుతమైన రచనతో సంభాషణలని రక్తి కట్టించడమే కాకుండా, ఒక్కోసారి దర్శకుడు ఫెయిలైనా డైలాగ్స్‌తో సీన్‌ని నిలబట్టి, తెరవెనుక హీరోగా నిలిచాడు సాయిమాధవ్ బుర్రా. . విజువల్‌గా అప్పీలింగ్‌గా ఉండడంలో కళా దర్శకుడు, ఛాయాగ్రాహకుడు వెన్నుదన్నుగా నిలిచారు. గ్రాఫిక్స్ పరంగా బాహుబలితో పోల్చే క్వాలిటీ అయితే లేదు. తక్కువ రోజుల్లో పూర్తి చేసిన సినిమా కనుక విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో కాంప్రమైజ్‌లు తప్పినట్టు లేవు.

ఇలాంటి పాత్రలు చేయాలంటే తను తప్ప ఇండస్ట్రీలో ఇంకో ఆప్షన్ లేదని బాలకృష్ణ ఇంకోసారి నిరూపించారు.ఆయన కెరీర్లో మరో గుర్తుండిపోయే పాత్రగా ఇది నిలిచిపోతుంది. భర్త యుద్ధ దాహానికి విసిగిపోయిన భార్యగా శ్రియ మెప్పించింది కానీ, స్ఫూర్తిప్రదాత పాత్రలో హేమామాలిని తేలిపోయింది. లిప్‌సింక్ ,నటనలో కూడా ఆమె విఫలం చెందింది. తెలుగువారి ఎమోషన్స్ టచ్ చేయడంలో కొంతవరకు సక్సెస్ అయింది. ఆ మహా చక్రవర్తి గురించి వివరంగా తెలియజెప్పి, అతడి ఘన చరిత్ర గురించిన ముద్రని బలంగా వేసేట్టుగా డ్రామా పండించాల్సింది. లోపాలు, లోటులు పక్కనపెడితే, ఇంత తక్కువ సమయంలో ఇంత చిత్రాన్ని తీర్చిదిద్దినందుకు క్రిష్ అభినందనీయుడు. తన ప్రతి చిత్రం ప్రత్యేకంగా ఉండాలనే తపనకి జేజేలు. సగటు సినిమాల విషయంలో అలసత్వం ఉండొచ్చు కానీ ఇలాంటి మహా యత్నాలకి లోతైన శోధనలు ఉంటే మరింత బాగుండేది.

– బోస్

## సినిమా



## ఎదిగినా కొద్దీ.. ఒదిగి ఉండాలి

జలా..జాలా...ప్రవహించే జలపాతాలన్నీ పల్లానికే ప్రవహిస్తాయి. పెద్దపెద్దచెట్ల కొమ్మలన్నీ పళ్లతో కిందికే వేలాడుతుంటాయి. అది ప్రకృతి నియమం.దీన్నిబట్టే పెద్దలంతాచెబుతుంటారు ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలని హాయ్‌ల్యాండ్‌లో జరిగిన ఖైదీ నెంబరు 150 ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో జరిగిన వివాదాస్పద సంఘటనలను ఒక్కసారి పరిశీలించుకుంటే విషయం బోధపడుతుంది. సినిమా ప్రమోషన్‌కోసం అతిరథమహారదులంతా వచ్చారు. ఇక రానిది పవన్‌కల్యాణ్, వరుణ్‌తేజ్‌మాత్రమే... అభిమానులంతా ఈ వేడుకకు అత్యుత్సాహంతో పాల్గొన్నారు. వారిని సంతృప్తి పరిస్తే సరిపోతుంది. ఒక వేళ ప్రేక్షకులు అడిగినా వారి గురించి సర్దిచెప్పడం ఏమంత కష్టం కాదు. ఏదో మనస్సులో పెట్టుకొని ఏదో మాట్లాడబోయి నాగబాబు ఫంక్షన్‌ను రసాభసా చేశారు. వ్యక్తిగతంగా కలుసుకున్నప్పుడు మాట్లాడవలసిన అంశాలను స్టేజీమీద పరుష పదజాలంతో తిట్టడం ఏమంత భావ్యం కాదు. యండమూరి అదే చెప్పారు. ఆ సంఘటన జరిగి ఆరేడు సంవత్సరాలయిన తర్వాత ఇప్పుడు తిట్టవలసిన అవసరం ఏముంది ? ఇప్పటికీ కనిపించినప్పుడు సినిమా కథ ఉంటే చూడమని అడుగుతూ ఉంటారు కూడా అన్నారు. ఇకపోతే రామ్‌గోపాల్‌ను తిట్టడం కొరివితో తలగోక్కున్నట్లు అయ్యింది. రామ్‌గోపాల్‌వర్మను ఒక్కసారి స్టేజీమీద తిట్టి ఆయన వ్యూహాత్మక తిట్లకు నాగబాబు బలయ్యారు. చిరంజీవి ఒక ఛానల్‌లో ఇంటర్వ్యూ ఇస్తూ రామ్‌గోపాల్ వర్మను వదిలిపెట్టమని చెప్పిన తర్వాతి రోజే వర్మతో మాట్లాడటం వేస్ట్ అని విరమించుకున్నారు.

ఒక వేడుకలో ఒక వ్యక్తి చిరంజీవిని చూసిన ఆనందంలో నమస్కారం పెట్టాడు. చిరంజీవి కూడా సదరు వ్యక్తికి అభివాదం చేశాడు. మరొసారి అదే వ్యక్తి పక్కడి సదరు హీరో రావడంతో మరోసారి నవ్వుతూ నమస్కారం చేశారు. మళ్లీ చిరంజీవి నమస్కారం చేశారు. ఇంకొంచెం సేపటి తర్వాత మళ్లీ చిరంజీవి ఆ వ్యక్తి వైపు చూసాడు, మళ్లీ ఆ వ్యక్తి నమస్కారం చేశాడు, అంతే చిరంజీవి అగ్గిమీదగుగ్గిలం అయిపోయారు. ఇడియట్ ఎన్నిసార్లు నా కాన్‌సెంట్రేషన్‌ను దెబ్బతీస్తావంటూ ఫైర్ అయ్యారు ఈ వీడియో ఇప్పటికీ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. చిరంజీవికి పద్మ భూషన్ పురస్కారం ఇచ్చిన నేపథ్యంలో గ్రాండ్ ఫంక్షన్ నిర్వహించారు. ఆ సభలో మోహన్‌బాబు పురస్కారాల గురించి కొన్ని విషయాలను లేవనెత్తుతూ ప్రసంగించారు. ఆయన తర్వాత పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తమ్ముడూ మోహన్‌బాబు అని పిలుస్తూ వెటకారం ఆడారు. మోహన్‌బాబు కోపంగా లేవబోతే సీనియర్ నటి జయసుధ ఆయన్ను వారించారు. నిజానికి వేడుక నిర్వహించి సాటి నటుడిని అంత అవమాన పరచనక్కర్లేదు. పరిటాల రవితో గొడవైనప్పుడు చిరంజీవి కోరిక మేరకు పవన్‌కల్యాణ్‌ను రక్షించడానికి మోహన్‌బాబు ఎంతో కృషిచేశారని ఆయన అభిమానులు తెలుపుతున్నారు.

ఒక కుటుంబంలోని వ్యక్తులను, వారి పిల్లలను, పిల్లల పిల్లలను ప్రజలు తమ భుజస్కందాలపై ఎత్తుకుంటుంటే ఎంతో వినమ్రంగా ఉండాల్సిందిపోయి, సాటి పరిశ్రమ వ్యక్తులను, అభిమానులను గాయపరిచే విధంగా మాట్లాడం వెటకారాలు, నిందలు, ఎంత మాత్రం హర్షించతగిన విషయం కాదు. ఇప్పటికైనా సినిమాల్లో ఆదర్శాలు కాకుండా నిజజీవితంలో వాటిని ఆచరించే విధంగా ఉన్నప్పుడే ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఇక రాంగోపాల్ వర్మ తెలివితేటలను వ్యర్థమైన విషయాలపై పెట్టకుండా ఉంటే బావుంటుంది. ఏదిఏమైనా ఈ విషయల్లో రజనీకాంత్ ఆదర్శప్రాయుడు.



## డిజిటల్ హైవే వైపు 4టిగో

**హైదబాద్ :** నగదు రహిత, డిజిటల్ హైవే వైపు రవాణా పరిశ్రమను తీసుకువెళ్లడానికి 4టిగో కృషి చేస్తున్నట్లు సంస్థ కో ఫౌండర్ వివేక్ మల్హోత్రా తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ లావాదేవీలను అందిచడం ద్వారా చిన్న ట్రాన్స్‌పోర్టర్లు, ఫ్లీట్ యజమానులకు నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు ప్రోత్సాహిస్తున్నామన్నారు. లారీలను అద్దెకు తీసుకోవడం దగ్గర నుంచి ఇంధన, టోల్ చెల్లింపులు, డ్రైవర్లు తమ కుటుంబానికి నగదు పంపకం ఇలా ప్రతి ఒక్కటి 4టిగో యాప్ (ఫ్లాట్‌ఫామ్) ద్వారా చేయవచ్చన్నారు. వెయ్యి మందికి పైగా ట్రక్స్ ఈ ఫ్లాట్‌ఫామ్‌పై నమోదు చేసుకున్నాయన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ సరుకు సులవుగా వెళ్లిపోయేందుకు 4టిగో నెట్‌వర్క్‌పై ఉన్న ట్రక్‌లను ఫాస్టాగ్ సిస్టమ్‌ను ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపుల కోసం అమలు చేస్తుందన్నారు. ఇది రవాణ కోసం అయ్యే సమయాన్ని తగ్గించడమే కాదు, టోల్ ఫ్లాజాల వద్ద భారీ క్యూలను కూడా తగ్గించడము కాదు, టోల్ ఫ్లాజాల వద్ద భారీ క్యూలను కూడా తగ్గిస్తుందన్నారు. ఇంధను కొనుగోలుపై రాయితీతో పాటు ఐఒసిఎల్‌తో 4టిగో భాగస్వామ్యం వల్ల ఐఒసిఎల్ యొక్క 800 రిటైల్ ఔట్‌లెట్లలో ట్రక్ డ్రైవర్లకు ఓవర్‌నైట్ స్టే, సురక్షిత పార్కింగ్ , బ్రేక్‌డౌన్, అసిస్టెన్స్, రిపేర్, మెయిన్‌టెన్స్ తదితర సదుపాయాలు డ్రైవర్ భద్రత, సౌకర్యం కోసం అందిస్తున్నామన్నారు. చిన్న, మధ్యతరహా వ్యాపారాల ఆధారిత ట్రాన్స్‌పోర్టుర్లు, ఫ్లీట్ యజమానుల కోసం వర్కింగ్ క్యాపిటల్ అని మల్హోత్రా తెలిపారు.

## నోట్లరద్దుతో సహకార రంగం దివాళా

### బ్యాంక్ ఎంప్లాయిస్ సదస్సులో సీఎం సినరాయి విజయన్

**రాజధాని ప్రతినిధి–తిరువనంతరం :** పెద్దనోట్ల రద్దుపై కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశీయ సహకార రంగం పతనమైందన్నారు. కేంద్రం రూ.500, రూ.1000 నోట్లను రద్దుచేయటాన్ని తుగ్లక్ తరహా సంస్క రణగా ఆయన విమర్శించారు. దశాబ్దంగా వైద్యానాథన్ కమిటీ సిఫార్సులను అమలు జరగన్విని కేరళలోని కోఆపరేటివ్‌లు తెరుకులేని స్థితికి చేసుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 28వ జాతీయ సదస్సులో సీఎం మాట్లాడారు. గ్రామీణ భారతానికి జీవనరేఖగా ఉండే సహకార రంగానికి తూట్లు పొడిచారని ఆయన విమర్శించారు. బ్యాంకుల ప్రతిష్ట, బ్యాంకింగ్ రంగంపై ప్రజల విశ్వాసాన్ని రక్షించాల్సిన వారే వాటిని భ్రష్టుపట్టించారని అన్నారు. నోట్ల రద్దు నేపథ్యంలో సొంత లాభాల కోసం జాతీయ, సహకార బ్యాంకులను అణచి వేయటం బాధాకరమని సీఎం అన్నారు. ప్రాథమిక వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.1.2లక్షల కోట్ల డిపాజిట్లతో కేరళలోని కోఆపరేటివ్‌లు పటిష్టమైనవనిగా ఆయన తెలిపారు. పేదలకు అనుకూలమైన సహకార బ్యాంకులపై నోట్లరద్దు తీవ్ర ప్రభావాన్ని చూపిందని, తద్వారా రైతులు బాగా నష్టపోయారని విజయన్ అన్నారు. నోట్లరద్దుతో బ్యాంకుల ఆదాయానికి గండి పడిందన్నది స్పష్టమౌతోందన్నారు. 60ఏళ్లలో ఎన్నడూ లేనంతగా అత్యల్ప రణవృద్ధి నమోదైందని ఎస్‌బీఐ ప్రధాన ఆర్థిక వేత్త సౌమ్యా కాంతి ఘోష్ ప్రజలు ముఖ్యంగా రైతులు, అణగారిన మర్గాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. నోట్ల రద్దు వల్ల రెండు మాసాలుగా దేశ ప్రజలు, బ్యాకింగ్ వ్యవస్థ అత్యంత క్రూరమైన ఆర్థిక వేధింపులకు గురతున్నారని విజయన్ అన్నారు.

# ముస్లింల గ్యార్మీ ర్యాలీ

**నందిగామ :** నందిగామ జామామసీద్,ఎంఎఎస్ఎన్‌సి కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ముస్లిం నాయకులు, మత పెద్దల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతిమ దైవ ప్రవక్త మహ్మద్‌సా మునిమనుమడు గౌస్ అజవారి సంస్రాద్ధి పవిత్ర గ్యారవీ మాసం సందర్భంగా చేపట్టిన ర్యాలీ పెద్ద మసీదు నుండి పాత బస్టాండ్ మీదగా గాంధీ సెంటర్ మెయిన్ బజార్ చంమామపేట మీదగా వేలాదిమంది. ముస్లీం సోదరులతో పెద్దఎత్తున ర్యాలీ నిర్మహించారు. ఈ సందర్భంగా ధార్మిక గురువులు గౌసిపాక్ సూచించిన శాంతి మార్గమును ప్రతిఒక్కరికీ అర్థమయ్యే రీతిలో తెలియజేశారు. గ్యారవీ మాసంలో ప్రతి ఒక్కరికీ జరిగే విధంగా దేవుడైన అల్లాహ్ శుభాలు ఫలాలు పుణ్యాలు ప్రసాదిస్తాడని ముస్లీం ధార్మిక గురువులు ముక్తి అబ్దుల్ హాలీమ్ సాహెబ్,అల్తాఫ్ రజాఖాన్ సాహెబ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మతవలి ఎండి ఖాజాముహిద్దీన్ మరియు జమాత్,ముస్లీం పెద్దలు,సిటిఓ బాబు,ఎండి మస్తాన్, అహ్మద్ భాష, బాజీఖాన్,ఆజీ యాఖూబ్,ఇర్ఫాన్, ప్రముఖ న్యాయవాది అమీన్ తదితరులు పాల్గొన్నారు.

### మసీద్ అనుబంధ కమిటీ ప్రమాణ స్వీకారం

సోమవారం నందిగామ జామా మసీదు అనుబంద కమిటీ అధ్యక్షునిగా షేక్ మున్న, కార్యదర్శిగా ఎస్‌డి కరిముల్లా,కోశాదికారిగా ఇలియాస్ అహ్మద్‌లచే గురువులు ముఫ్తి అబ్దుల్ హాలీమ్ సాహెబ్, మహ్మద్ అల్తాఫ్



రజాఖాన్ సాహెబ్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో వికలాండులైన షేక్ సుభానీకి కమిటీ ఆధ్వర్యంలో ట్రై సైకిల్ పంపిణీ చేశారు. మహిళలకు కుట్టుమిషన్‌లు, సరుకులు పంపిణీ చేశారు. ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ రబ్బాని, షేక్ దస్తగిరి, సహాయ కార్యదర్శులు షేక్ మిరా, షేక్ భాష,సభ్యులు ఎండి సత్తార్, ఎండి మన్న, షేక్ ఖాజ, షేక్ అల్లీ,ఎండి కరీమ్, మోహిదీన్, షేక్ అక్బర్, షేక్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

# కేరళ సినీ దర్శకుడికి బీజేపీ బెదిరింపు

**కోజికోట్ :** కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రచయితలు, కళాకారులను బెదిరించడం ఎక్కువయ్యింది. ఆ పార్టీకి నుబంధంగా పనిచేస్తున్న కొన్ని సంస్థలు ప్రముఖ రచయితలను చంపి వేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పుడు కేరళ సినీ దర్శకులు, కేరళ చలనచిత్ర అకాడమీ చైర్మన్ కమల్‌ను బీజేపీ కేరళ నాయకుడు ఏఎన్ రాధాకృష్ణన్ బెదిరిస్తున్నాడు. సినిమా హాళ్లలో తప్పనిసరిగా జాతీయగీతాన్ని ఆలపించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని పాటించకపోతే కమల్ ఈ దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవాలని హుకం జారీ చేశారు. రాధాకృష్ణన్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, కమల్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా లాంటి తీవ్రవాద గ్రూపుకు చెందినవాడని ఆరోపించాడు. అంతేకాకదు కేంద్రం పెద్ద నోట్లు రద్దు చేయటం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని 15 రోజుల క్రితం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత తీవ్ర ఎంటీ వాసుదేవన్ నాయర్ చేసిన ప్రకటనపై రాధాకృష్ణన్ పెద్ద దుమారం లేవదీశారు. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వల్ల ఎన్నో

### దేశాన్ని విడిచివెళ్లాలని ఆదేశం

ప్రయోజనాలు ఉన్నాయి. ఆర్థికవేత్త కాని రచయితకు వీటి గురించి ఏం తెలుస్తుంది. అని బీజేపీ నేత నోరు పారేసుకున్నాడు. చేగువేరా వాల్‌పోస్టర్లను, ఇతర చిత్రాలను తీసివేయాలని వామపక్షాలను కోరాడు. మహాత్మాగాధీం, స్వామి వివేకానంద, మదర్‌థెరిస్సా, శ్రీ నారయణగురు లాంటి వారి ఫోటోల పక్కనే చేగువేలా ఫోటోను పెట్టడం బీజేపీ నేతకు నచ్చలేదు. చేగువేరా క్రూరత్వానికి, అరాచకానికి చిహ్నమని, రాధాకృష్ణన్ తనకు తెలియని వాటిని గురించి వ్యాఖ్యానించారు. కేరళ గ్రామీణ ప్రాంతాల్లో చే గువేరాను పోరాట యోధుడిగా చిత్రిస్తున్నారని మాట్లాడుతూ, ఇక్కడ వామపక్షాల కార్యకర్తలు కూడా చేగువేరా మార్గాన్నేందుకు హింసను సృష్టిస్తారని ఆయన ఆరోపించాడు. పార్టీలతో నిమిత్తం లేకుండా చేగువేరా చిత్రాలను ముద్రించిన బనియన్లను ధరించే యువతను బహుశ రాధాకృష్ణన్ చూసి ఉండకపోవచ్చు.

## మూడు టికెట్లు... రూ.36 లక్షలు

**బెంగళూరు :** అభిమానులను ఉత్తేజపరుస్తూ చిరంజీవి తీసిన తన 150వ సినిమా అభిమానుల ముందుకు వచ్చింది. ఎప్పుడెప్పుడూ ఈ సినిమా చూస్తామా? అన్నంత ఆత్రంగా అభిమానులు ఎందురుచూస్తున్నారు. పదేళ్ల గ్యాప్ తర్వాత వస్తుండడంతో ఎంత ఖరైనా ఫర్యాలేదు.. తొలిరోజు తొలి షో ఎంత చూసి తీరాల్సిందే అన్న పట్టుదలతో వారంతా ఉన్నారు. దీనికి అందుకు నిదర్శనం బెంగళూరులో జరిగిన ఓ ఘటనే. ఓ థియేటర్లో మూడు టికెట్లను వేలం వేస్తే.. రూ.36 లక్షలకు దక్కించుకున్నాడట ఓ చిరు అభిమాని. ఇక, ఆ వేలంలో వచ్చిన డబ్బును చిరంజీవి పేరిట బెంగళూరులోని ఓ అనాథాశ్రమానికి విరాళంగా ఇవ్వాలని థియేటర్ యాజమాన్యం భావిస్తోందట.

## ఆర్టీసీ డ్రైవర్‌కు జాతీయస్థాయి గుర్తింపు

**రాజధాని ప్రతినిధి–విజయవాడ :** ఆర్టీసీ డ్రైవర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రోడ్డు భద్రతలో విశేష కృషి చేసేవారికి కేంద్ర రోడ్డు రవాణా, హైవే మంత్రిత్వశాఖ ఏటా బహుమతులు, ప్రశంసాపత్రాలను ఇచ్చి ఘనంగా సత్కరిస్తుంది. ఈ ఏడాది ప్రకాశంజిల్లా ప్రొద్దు టూరు డిపోనకు చెందిన డ్రైవర్ జి.దస్తగిరి (ఇ.100410) ప్రమాద రహిత సర్వీసుకు ఎంపికయ్యారు. ఆయన 34 ఏళ్ల సర్వీసులో ఒక్క ప్రమాదం కూడా లేకుండా వాహనాలను నడిపారు. ఢిల్లీలో జరిగిన జాతీయ రోడ్డు భద్రతా సమావేశంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా దస్తగిరి పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డులో భాగంగా ఆయనకు రూ.25వేల నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ డాక్టర్ ఎం మాలకొండయ్య దస్తగిరికి అభినందనలు తెలియజేశారు. ఇతర డ్రైవర్లు కూడా దస్తగిరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దస్తగిరి గతంలో రీజనల్ స్థాయిలో, జోనల్ స్థాయిలో ఒక్కోసారి రాష్ట్రస్థాయిలో కూడా రెండుసార్లు రోడ్డు భద్రతా అవార్డులను సాధించారు.

## దక్షిణ మధ్య రైల్వే జీఎంగా వీకే యాదవ్

**రాజధాని ప్రతినిధి–విజయవాడ:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా వినోద్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఆయన సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ముఖ్య పౌర సంబంధాల అధికారి ఎం ఉమాశంకర్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. యాదవ్ ఈ బాధ్యతలను చేపట్టడానికి ముందు ఢిల్లీలోని రైల్వే ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్టులు, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డెరెక్టర్‌గా విధుల నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన ఆయన ఆస్ట్రేలియాలోని లా ట్రోట్ విశ్వవిద్యాలయం నుండి టెక్నాలజీ మేనేజిమెంటులో ఎంబీఏ పూర్తిచేశారు. ఆయన 1982లో రైల్వేశాఖలో సహాయ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా జీవితాలన్ని ప్రారంభించారు. అలాగే ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఐఆర్‌సీఓఎన్)లో డైరెక్టర్‌గా చేస్తూటర్కీలో విద్యుత్ రైలు మార్గ నిర్మాణ పనులను కూడా యాదవ్ పర్యవేక్షించారు.

# ఐదురాష్ట్రాల ఎన్నికల భేరి

## ఉత్తరప్రదేశ్


ఉత్తర ప్రదేశ్ సమాజ్‌వాదీపార్టీలో తండ్రి ములాయం సింగ్, కొడుకు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అఖిలేష్‌కు జరుగుతున్న సమరభేరిలో ముఖ్యమంత్రి పై చేయి సాధించారు. అంతేకాదు సమాజ్‌వాదీ పార్టీ బ్యాంకు ఖాతాలను కూడా స్థంబింపచేశారు. ఎన్నికల్లో పొత్తులతో పోటీచేసినా, లేకుండా చేసినా రాష్ట్రంలోని 403 అసెంబ్లీ స్తానాల్లో 300 సీట్లు గెలుచుకుంటామని అఖిలేష్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తండ్రీతనయుల మధ్య రాజకీయాలు రోజురోజుకు మారుతున్నాయి. ఒకరోజు మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున అఖిలేష్‌కు సంఘీభావం తెలుపుతున్నారు. ములాయంసింగ్ పార్టీలో ముసలాన్ని తనకు లబ్ధి చేకూర్చుకునే విధంగా బహుజనసమాజ్ (ఎస్పీ) అధినేత్రి మాయావతి ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా యూపీ జనాభాలో 20 శాతం ఉన్న ముస్లింలకు 97 సీట్లు, దళితులకు 87 సీట్లు కేటాయించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పార్టీని బలోపేతం చేయాలని మాయావతి ఆదేశించారు. యూపీలో ఆమ్ ఆద్మీపార్టీ పోటీచేయదని, అయితే బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని ఆపార్టీ ప్రకటించింది.

## చత్తీస్‌ఘడ్

చత్తీస్‌ఘడ్‌లో బీజేపీ ప్రభుత్వం రమణ్‌సింగ్ ప్రభుత్వం ఉన్నప్పటికీ అది కాంగ్రెస్ సహాయసహకారాలతో నడుస్తోంది. ఆడియో టేపు నుంచి బయటకు వచ్చిన అజిత్‌జోగి కొత్త పార్టీ చత్తీస్‌ఘర్ జనతాకాంగ్రెస్ పార్టీతో రెండు జాతీయ పార్టీలకు తలనొప్పి తప్పకపోవచ్చు. శతనమిలో ఆయన ప్రాబల్యం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో 50 శాతం జనాభాగల షెడ్యూల్డుకులాలు,జాతులు ఆయనకు మద్దతు నిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌నుంచి విడిపోయిన చత్తీస్‌ఘర్‌కు అజిత్‌జోగి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆపై మూడు సారులు వరుసగా బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. బీజేపీ ప్రభుత్వ తప్పిదాలపై ప్రతిపక్షనేతగా పోరాడవలసి కాంగ్రెస్‌నేత అజిత్‌జోగి దానితో మిలాఖత్ అయ్యారు. అనంతఘర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన పోటీలో అజిత్‌సింగ్, ఆయనకుమారుడు అమిత్‌సింగ్‌లు బీజేపీతో గూఢుపుఠాణీ కొనసాగించారని దాంతో బీజేపీ సులభంగా ఆ స్థానాన్ని సంపాదించుకుందని కాంగ్రెస్ అధిష్టానం అమిత్‌పై 6 ఏళ్లపాటు వేటు వేసింది. అనంతఘర్ ఎన్నికల్లో బీజేపీతో మంతనాలు జరిపిన ఆడియో కేసెట్ బయటకు రావడం రాష్ట్రంలో సంచలనం కలిగించింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందో కాలమే చెప్పాలి.

## గోవా

గోవాలో అధికారంలో ఉన్న బీజేపీకి గట్టి పోటీ ఎదురవుతోంది. ఆర్ఎస్ఎస్‌లోని తిరుగుబాటుదారులంతా పార్టీని ఏర్పాటు చేయడం, ఆరాష్ట్రంలో ఆప్‌బలాన్ని పుంజుకోవడం బీజేపీకి దెబ్బేనని చెప్పక తప్పదు. ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి చెక్ పెట్టేందుకు మహారాష్ట్ర వాదీ గోమాంతక్ పార్టీ (ఎంజీపీ), గోవా సురక్షా మంచ్ (జీఎస్ఎం), శివసేన కూటమిగా ఏర్పడనుంది. గోవా సురక్ష మంచ్‌ను ఆర్ఎస్ఎస్ రెబల్‌కు సుభాష్ వెలింకర్ ఏర్పాటు చేయగా, మహారాష్ట్రవాదీ గోమాంతర్ రాష్ట్రంలో పాత పార్టీ. లక్ష్మీకాంత్ పార్సేకర్ కేబినెట్‌లో నుంచి ఇద్దరు మంత్రులను తొలగించడంతో ఇటీవలే ఎజీపీ బీజేపీతో తెగతెంపులు చేసుకుంది. 'గోవాలో జరగబోయే ఎన్నికల్లో మూడు పార్టీలు స్థానాలను పంచుకుంటాయి. భావసారూప్యత గలవారితో కలిసి ఈ పెద్దకూటమి ఏర్పడుతోందని ఎంజీపీ నాయకుడు సుధిన్ ధవళికర్ తెలిపారు. ఈ సమావేశంలో జీఎస్ఎం తరపున వెలింకర్,శివసేన తరపున సంజయ్ రౌట్ పాల్గొన్నారు. 40 స్థానాల్లో ఉన్న అసెంబ్లీలో కూటమి 35 స్థానాల్లో పోటీ చేస్తుంది. సుధిన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. మిగతా ఐదు స్థానాలపై కూటమి వైఖరిని వారు చెప్పలేదు.



శివసేన నాలుగు స్థానాల్లో పోటీ చేస్తుందని ధవళికర్ తెలిపారు. గోవా సురక్షా మంచ్ ఆరు స్థానాల్లో మిగిలిన స్థానాల్లో మహారాష్ట్రవాదీ గోమాంతక్ పార్టీ పోటీ చేస్తుందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో, కేంద్రంలోను శివసేన భాగస్వామి. అయితే మొట్టమొదటిసారిగా గోవాలో గట్టి పోటీ ఇవ్వబోతోంది. తాము గనుక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఇంగ్లీషు మీడియంలో బోధించాలనే ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయాలను తక్షణం తొలగించడమే తమ ధ్యేయమని వెలింకర్ తెలిపారు. దీనిపై కూటమిలోని భాగస్వాములందరూ ఓ నిర్ణయం తీసుకున్నారు. దీనికి వెలింకర్‌ను కన్వీనర్‌గా నియమించారు. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన మధ్య చాలా కాలం నుంచి రాజకీయ అవగాహన ఉందనీ, 2014 ఎన్నికల్లో బీజేపీ రాజకీయ లబ్ధికోసం యత్నించడంతో పొత్తు విరమించుకుందని సంజయ్ రౌత్ తెలిపారు.

## మణిపూర్

ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో మణిపూర్ రాజకీయాలు వేడెక్కాయి. అధికారం చేజిక్కించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టాయి. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీని, ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌లను ఓడించేందుకు వామపక్షపార్టీలైన సీపీఐ, సీపీఎం, లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్‌తోపాటు మణిపూర్ నేషనల్ డెమొక్రాటిక్ ఫ్రంట్ ఎన్‌సీపీ, జేడీయూ పార్టీలు (6 పార్టీలు ) ఏకమయ్యాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. చేతులు కలిపిన అన్ని పార్టీల్లోనూ ఒక్క ఎన్‌సీపీనే గత ఎన్నికల్ల ఒక్క అసెంబ్లీ స్థానాన్ని సాధించింది. గెలిచిన అభ్యర్థి లైసోమ్ ఇబోవమ్‌చా కూడా ఇటీవలే అధికార కాంగ్రెస్‌లో చేరారు.

## పంజాబ్

పంజాబ్‌లో అధికారంలో ఉన్న బీజేపీ–శిరోమణి అకాలీదళ్‌లపై కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీపార్టీలు పైచేయి సాధించడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నాయి. పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాష్‌సింగ్‌బాదల్ హయాంలో గురుద్వారాల్లో జరిగిన అపవిత్రకార్యాలు, రాష్ట్ర యువతను వేధిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారి, రైతుల ఆత్మహత్యలు, దళితులపై దాడులకు కారణం ప్రభుత్వకారణంగా చూపుతూ ఈ రెండు పార్టీలు ఎన్నికల రంగంలో దిగాయి. ఆప్ అధికారంలోకి వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్థానికులకే అవకాశం ఇస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. కాంగ్రెస్‌కూడా తన ప్రాబల్యం పెంచుకుంటానికి గట్టి ప్రయత్నం చేస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఎన్నికల్లో ఆప్ వర్సెస్ కాంగ్రెస్‌గా ఉంటుందని ఎన్నికల పరిశీలకులు చెబుతున్నారు. కాంగ్రెస్‌నాయకుడు అమర్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆప్‌కు క్షేత్రస్థాయిలో బలంలేదని ఎద్దేవా చేస్తున్నారు. మాజీ క్రికెటర్ నవజ్యోత్‌సింగ్‌సిద్దూ కాంగ్రెస్‌లో చేరడం ఆపార్టీకి మరింత బలం చేకూరుతుందని భావిస్తున్నారు. పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో అధికార పార్టీ అన్ని రాష్ట్రాల్లోనూ వ్యతిరేకత చవిచూసే అవకాశం ఉంది.

– బోస్

# సమానత్వమే మన అజెండా

### ఒబామా వీడ్కోలు సందేశం



**వాషింగ్టన్ :** ప్రజలు ఉదార విలువల కోసం పోరాటాన్ని కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. ఆదాయ సమానత్వం జాతుల స్వస్థత, ద్వైపాక్షిక సహకారం కోసం ప్రజలు అంకితమై పోరాడాలని సూచించారు. 8 ఏళ్ల తన పాలనాకాలంలో లక్ష్యాలను పరిపూర్ణయంగా సాధించలేదు. వీడ్కోలు సమావేశంలో పాల్గొనేందుకు ఒబామా తన సొంత పట్టణం చికాగోకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన సమావేశానికి దాదాపు 20,000 మందికి పైగా ఆయన మద్దతుదారులు హాజరయ్యారు. డొనాల్డ్ ట్రంప్ పరిపాలనాకాలంలోనూ, ఉదారమైన విలువల కోసం పోరాడాలని కోరారు. మనం తప్పనిసరిగా నూతన సామాజిక సఖ్యతను సాధించాలి. ప్రజలదంరికీ అవకాశాలు కల్పించకపోతే అసంతృప్తి, విభజన ఏర్పడతాయి. ఇవి మన అభివృద్ధులకు ఆటంకంగా తయారవుతాయి. భవిష్యత్తులో ఇవి మరింత పదునెక్కుతాయని ఒబామా అన్నారు. శరణార్థుల పిల్లల కోసం పెట్టుబడులు పెట్టి వారిని మన పిల్లలాగా చూడకపోతే మన పిల్లల అభివృద్ధిని తగ్గించినవారమవుతామన్నారు. కుటుంబాలు విచ్ఛిన్నమైన పిల్లలు అమెరికా ప్రజలతో అత్యధిక భాగంగా ఉన్న కార్మికశక్తికి ప్రతినిధులు. అందువల్ల శరణార్థుల పిల్లలను చూడవలసిందేనని ఒబామా కోరారు. శ్రోతలతో కలిసి కూర్చున్న మిషెల్లీ ఒబామాకు ఆయన అభినందనలు తెలిపారు. ఉద్విగ్నతకు గురైన ఒబామా కొద్దిసేపు ఆగి ఆ తర్వాత ప్రసంగించారు. వైట్‌హౌస్‌ను అందరికీ చెందినదిగా మిషెల్లీ తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఒబామాకు 57 శాతంమంది ప్రజలు అనుకూలంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లుగా అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. అయితే అధ్యక్షపాలనలో దేశం మరింత ఐక్యతగా ఉందని 25శాతం మంది తెలపగా, మరింత విభజనకు గురైందని 44శాతంమంది తెలిపారు. జాతుల మధ్య విభజన ఒబామా హయాంలో మరింత అధ్వానంగా తయారైందని, ఆయన తన వాగ్దానాలను నెరవేర్చుకోలేకపోయారని 44శాతం అమెరికన్లు తెలియజేసినట్లుగా అసోసియేటెడ్ ప్రెస్ పోల్‌సర్వే తెలిపింది.






# హామీలు అమలుచేయాలని వినతి

**రాజధాని ప్రతినిధి–తుళ్ళూరు :** అధికారంలోకి వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలని సీపీఐ అమరావతి రాజధాని ప్రాంత కమీటి డిమాండ్ చేసింది. తుళ్ళూరు సీఆర్డీఏ ప్రాతీయ కార్యాలయంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సీపీఐ ఇన్‌ఛార్జ్ కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ అమరావతి రాజధాని గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు, శ్రామికులు,మహిళాలు నిరుద్యోగులు,వివిధ వృత్తుల నిరుపేదలు ఉపాధి కోల్పోవడంతో వారి జీవనం విధానం అస్తవ్యస్తంగా మారిందన్నారు. సీపీఐ అమరావతి కార్యదర్శి చింతరాల కోటేశ్వరరావు లంకలకు తక్షణమే ప్యాకేజ్ ప్రకటించాలని కోరారు.









## సచివాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

### మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీ..శంకుస్థాపన ప్రదేశంలో 13న సంక్రాంతి

**రాజధాని ప్రతినిధి–అమరావతి :** వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో తొలి సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ నుంచి వెలగపూడికి పూర్తి స్థాయిలో తరలివచ్చిన తర్వాత తొలి సంక్రాంతి కావడంతో ఉద్యోగుంతా ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్రాంతి సంబరాల్లో భాగంగా సచివాలయంలో ఐదో బ్లాకు వెనుక భాగంలో సచివాలయం సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. మహిళా ఉద్యోగులు పోటాపోటీగా అందమైన రంగవల్లులను తీర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పూనం మాలకొండయ్య ముగ్గువేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, మహిళా ఉద్యోగుల సంఘం నాయకులు సత్యసులోచన,వరలక్ష్మి వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల పాల్గొన్నారు.సంక్రాంతి సంబరాలను రాజధాని అమరావతిలో నిర్వహించటానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్దండ్రాయునిపాలెంలో రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన ప్రదేశాన్ని ఇందుకు వేదికగా ఎంచుకుంది. గుంటూరు కలెక్టర్ కాంతిలాల్ దండే ఈ ప్రదేశాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతి సంబరాలలో పాల్గొంటారు. ఆతర్వాత తన స్వగ్రామం నారా వారిపల్లె వెళతారు.

























Editor : Pattan Hussain Khan, Printed and Published by him on behalf of Vastitude media pvt ltd. Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP. 522237. Printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18